


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 319, పేజీలు - 08




శనివారం, మే 9, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

# కొడంగల్‌ను బంగారు తునకగా మార్చుకుందాం

## - దేశంలోని గొప్ప ప్రాజెక్టులన్నీ కొడంగల్‌కు రప్పిస్తానన్న సీఎం

- కొడంగల్ బాలాజీ ఆలయ పునర్నిర్మాణ పనులకు భూమిపూజ చేసిన సీఎం
- అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా గ్రూపులు పక్కన పెట్టాలన్న సీఎం
- కొడంగల్‌ను రాష్ట్రానికే కాకుండా దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్న రేవంత్ రెడ్డి





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా గుంపులు, గ్రూపులు పక్కన పెట్టి అందరం కలిసికట్టుగా పనిచేస్తే కొడంగల్ శాసనసభ నియోజకవర్గాన్ని రాష్ట్రానికే కాకుండా దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దుకోగలుగుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. కొడంగల్ నియోజకవర్గాన్ని గొప్పగా అభివృద్ధి చేసుకోవాలన్న సంకల్పంతో తలపెట్టిన పనులను 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేసుకుందామని పిలుపునిచ్చారు. కొడంగల్‌లో శ్రీ మహాలక్ష్మీ వెంకటేశ్వరస్వామి (కొడంగల్ బాలాజీ) ఆలయ పునర్నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన యాగంలో పాల్గొన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి , జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### - చదువుల కోసం కొడంగల్‌కు వచ్చేలా పనులు చేపట్టాం

ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా కొడంగల్ బాలాజీ ఆలయ పునర్నిర్మాణంతో పాటు కొడంగల్‌లో 430 పడకల ఆసుపత్రి నిర్మాణం, దౌల్తాబాద్ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం, కోస్గి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయాల అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇక్కడి నుంచి శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగించారు. దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోక నిర్లక్ష్యానికి

2లో..

# మళ్లీ మొదటికొచ్చిన విజయ్ కథ

## - విజయ్ ప్రమాణ స్వీకారంపై మళ్లీ సస్పెన్స్

- టీవీకేకు లేఖను ఈమెయిల్ చేసినట్లు 'ఎక్స్' ద్వారా వెల్లడి
- అసెంబ్లీ ఎన్నికల్లో రెండు స్థానాలు గెలిచిన వీసీకే పార్టీ
- వీసీకే మద్దతుతో 118కి చేరిన విజయ్ బలం




చెన్నై (ప్రశ్న న్యూస్) తమిళనాడులో మరో బిగ్ ట్విస్ట్. టీవీకే అధినేత విజయ్ 118 మంది ఎమ్మెల్యేలతో కూడిన జాబితాను గవర్నర్‌కు అందజేశారని, దీంతో రేపు ఉదయం ప్రమాణ స్వీకారం చేయనున్నారని టీవీకే, వామపక్షాలు సంబరాలు చేసుకుంటున్నాయి. నేడు ఉదయం 11 గంటలకు విజయ్ ప్రమాణ స్వీకారం చేయబోతున్నారని టీవీకే, వామపక్షాల నాయకులు ప్రకటన చేశారు. కానీ విజయ్‌ని నేడు ప్రమాణ స్వీకారానికి ఆహ్వానించలేదని లోక్ భవన్ వర్గాలు తెలిపాయి. టీవీకేకు కాంగ్రెస్, వామపక్షాలు మద్దతు పలికాయి. రెండేసి స్థానాలు గెలుచుకున్న వీసీకే, ఐయూఎంఎల్ కూడా మద్దతు ఇస్తామని తెలిపాయి. కానీ గవర్నర్‌కు మద్దతు లేఖను ఈ పార్టీలు అందించలేదు. దీంతో ప్రమాణ స్వీకార అంశం మళ్లీ

2లో..

# తెలంగాణ బీజేపీ ఆపరేషన్ ఆకర్ష్

## - బీఆర్ఎస్ ముఖ్యనేతలందరూ వరుస కడతారా.?

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాజకీయాల్లో భారతీయ జనతా పార్టీ తన వ్యూహాలకు పదును పెడుతోంది. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో అనూహ్యంగా 8 స్థానాలను కైవసం చేసుకుని, ఓట్ల శాతాన్ని భారీగా పెంచుకున్న కమలదళం, ఇప్పుడు మిషన్ 2028 లక్ష్యంగా పావులు కదుపుతోంది. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగడమే కాకుండా, బీఆర్ఎస్‌ను మూడో స్థానానికి పరిమితం చేసేలా బీజేపీ అగ్రనాయకత్వం పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తోంది.

### - బీఆర్ఎస్ ఖాళీయే లక్ష్యంగా ఆపరేషన్ ఆకర్ష్

తెలంగాణలో పదేళ్లపాటు చక్రం తిప్పిన బీఆర్ఎస్ ప్రస్తుతం గడ్డు కాలాన్ని ఎదుర్కొంటోంది. అసెంబ్లీ ఓటమి తర్వాత ఆ పార్టీ నుంచి వలసలు కొనసాగుతుండగా, వాటిని తమకు అనుకూలంగా మార్చుకోవడంలో బీజేపీ విఫలమవుతోంది. కానీ ఇప్పుడు రూటు మార్చాలనుకుంటోంది. నియోజకవర్గస్థాయి నేతలు లేకపోవడం ఆ పార్టీకి సమస్యగా మారింది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని బీఆర్ఎస్ ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని, బలమైన కేడర్‌ను ఆకర్షించడం ద్వారా పార్టీని బలోపేతం చేయాలని డిసైడయింది. బీఆర్ఎస్ రాజకీయ ఉనికి ముగిసింది అనే సంకేతాలను ప్రజల్లోకి బలంగా పంపడం ద్వారా, ఆ పార్టీ ఓటు బ్యాంకును తమవైపు తిప్పుకోవాలని బీజేపీ భావిస్తోంది.

### - క్షేత్రస్థాయి వ్యూహాలు



బీజేపీ రాష్ట్ర రాజకీయాల్లో కీలక నేతలుగా ఉన్న ఈటల రాజేందర్ , కేంద్ర మంత్రి బండి సంజయ్ భిన్నమైన వ్యూహాలతో పనిచేస్తున్నారు. బీఆర్ఎస్ అంతర్గత పరిణామాలు తెలిసిన ఈటల, ఆ పార్టీలోని అసంతృప్త నేతలతో టచ్‌లో ఉంటూ ఆపరేషన్ ఆకర్ష్ ను పర్యవేక్షిస్తుండగా బండి సంజయ్ తనదైన శైలిలో హిందూత్వ ఎజెండా, యువతను ఆకట్టుకునేలా క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తున్నారు. సంస్థాగతంగా బలంగా ఉన్న ప్రాంతాల్లో పట్టు నిలుపుకుంటూనే, బలహీనంగా ఉన్న దక్షిణ తెలంగాణలో పార్టీని విస్తరించడమే వీరిద్దరి ప్రధాన లక్ష్యం.

### - తెలంగాణలో కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ పాలిటిక్స్?

రాష్ట్రంలో ఇప్పుడు రాజకీయాలు క్రమంగా ద్వైపాక్షికంగా మారుతున్నాయి. ఒకప్పుడు బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ అన్నట్లుగా ఉన్న పోరు, ఇప్పుడు కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ గా రూపాంతరం చెందుతోంది.

2లో..

# వైఎస్ఆర్‌సీపీ పొలిటికల్ రీ బ్రాండింగ్ ప్లాన్

## - ఎన్నికలకు ముందు గ్రౌండ్ వార్



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా లేనప్పటికీ, ప్రజల గొంతుకగా నిలిచేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సరికొత్త రీ-బ్రాండింగ్ వ్యూహంతో ముందుకు వెళ్తోంది. గత ఎన్నికల ఓటమిని విశ్లేషించుకున్న అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఇప్పుడు పరిపాలనను కేవలం విమర్శించడమే కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమవ్వడమే లక్ష్యంగా కొత్త కార్యాచరణను రూపొందించారు.

### - టార్గెట్ అమరావతి

రాజధాని అమరావతి నిర్మాణంలో ప్రభుత్వం చూపిస్తున్న లెక్కలపై వైఎస్సార్‌సీపీ ఎదురుదాడి ప్రారంభించింది. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ప్రభుత్వాన్ని నిలదీస్తూ అమరావతి ఒక సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్ట్ అనే ప్రభుత్వ వాదన పచ్చి అబద్ధమని ధ్వజమెత్తారు. ఎకరాకు రూ. 3.63 కోట్ల రిజిస్ట్రేషన్ విలువ ఉన్న భూమిని రూ. 50 కోట్లుగా చూపిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, సచివాలయ

2లో..

# అంతర్జాతీయ విద్యాభ్యాసానికి పావలా వడ్డీకే రుణాలు

## - విద్యార్థులకు అండగా చంద్రబాబు ప్రభుత్వం

- జాతీయ, అంతర్జాతీయ విద్యకు పావలా వడ్డీకే రుణాలు
- కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ఆదేశాలు
- ఆగస్టు 15 నాటికి 2.5 లక్షల ఇళ్లకు సామూహిక గృహప్రవేశాలు






అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్‌లోని పేద, మధ్యతరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తూ చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరుగాంచిన విద్యాసంస్థల్లో చదువుకునేందుకు వీలుగా పావలా వడ్డీ (25 పైసల వడ్డీ)కే విద్యా రుణాలు అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న ఏడవ జిల్లా కలెక్టర్ల సమావేశంలో భాగంగా సంక్షేమ

2లో..

# జూబ్లీ హిల్స్ క్రైమ్ లో నేపాలీ ముఠా

## - సీపీ సజ్జనార్ నేపాలీ గ్యాంగ్ పై అలెర్ట్!

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) జూబ్లీహిల్స్ ప్రశాసన్ నగర్లో దారుణ ఘటన చోటు చేసుకున్న విషయం తెలిసిందే. విశ్రాంత ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రే భార్య తనూజ దారుణ హత్యకు గురయ్యారు . దీనిపైన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే వాళ్ళ ఇంట్లో పనిచేసే పనిమనిషి కల్పన ఈ హత్యకు కీలక పాత్ర పోషించినట్లు ప్రాథమికంగా గుర్తించారు. కల్పన మరో ఇద్దరితో కలిసి పక్కా ప్రణాళికతో దారుణానికి పాల్పడినట్లు తెలుస్తోంది.

### - విశ్రాంత ఐపీఎస్ అధికారి భార్య దారుణ హత్య



ఈ క్రమంలో జూబ్లీహిల్స్‌లో విశ్రాంత ఐపీఎస్ వినయ్ రంజన్ రే సతీమణి తనూజ హత్య కేసు వివరాలను హైదరాబాద్ సీపీ సజ్జనార్ వెల్లడించారు. ఈ దారుణం మే 8, 2026

2లో..

# కేటీఆర్‌లా దోచుకోవడం, దాచుకోవడం తెలియదు

### - వారిలా డ్రగ్స్ తీసుకోవడం తనకు తెలియదని బండి వ్యాఖ్య



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్‌లా దోచుకోవడం, దాచుకోవడం తనకు తెలియదని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో రైతులకు బేడీలు వేసి ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారని, అలా హింసించడం తనకు

2లో..

# కవిత వర్సెస్ కేటీఆర్

## - ఎవరి బలం ఎంత.?



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాజకీయాల్లో టిఆర్ఎస్ పేరుతో కొత్త రాజకీయ పార్టీ పెట్టి, ప్రజలలోకి దూకుడుగా వెళుతున్న కవిత పైన ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఇదే సమయంలో కవితను ఎదుర్కోవడానికి కేటీఆర్ ఏం చేయబోతున్నాడు అన్నది కూడా ఆసక్తికరంగా మారింది. తెలంగాణ రాజకీయాలలో కల్వకుంట్ల కవిత, కేటీఆర్ ఇద్దరు కీలక పాత్రధారులు.

### - కేటీఆర్, కవితలలో రాజకీయంగా ఎవరు తెలివైన వారు?

2లో..

# బెంగాల్ తొలి బీజేపీ సీఎంగా సువేందు

### - నేడు 11:30 గంటలకు ప్రమాణ స్వీకారం



2లో..

# ఎస్ఐఆర్‌తో రాష్ట్రంలో ఓట్లు తొలగించేందుకు కుట్ర

- ఎస్ఐఆర్ను కలసికట్టుగా ఎదుర్కోవాలన్న సీఎం రేవంత్
- హజ్ యాత్ర బస్సు ప్రారంభించిన ముఖ్యమంత్రి
- మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని వెల్లడి



2లో..

# మళ్లీ మొదటికొచ్చిన విజయ్ కథ

మొదటికి వచ్చి, సస్పెన్స్ కొనసాగుతోంది. విజయ్ శుక్రవారం సాయంత్రం మూడోసారి గవర్నర్‌ను కలిసి తనకు మద్దతిస్తున్న ఎమ్మెల్యేల జాబితాను అందజేశారు. విజయ్‌కు మద్దతిస్తున్నట్లు ఇప్పటికే కాంగ్రెస్ గవర్నర్‌కు లేఖను అందజేసింది. ఈరోజు వామపక్షాలు కూడా మద్దతు లేఖను అందించాయి. వీఎంసీ, ఐయూఎంఎల్ మద్దతు ప్రకటించాయి. కానీ గవర్నర్‌కు లేఖను అందజేయలేదు. లేఖ అందజేయడంపై నిర్ణయిస్తామని వీసీకే తెలిపింది.

మరోవైపు, టీవీకే పార్టీకి మద్దతు ఇవ్వబోవడం లేదని తాజాగా ఐయూఎంఎల్ ప్రకటన విడుదల చేసింది. చివరి నిమిషంలో వీసీకే, ఐయూఎంఎల్ చేయివ్వడంతో, ఎమ్మెల్యేల బలం 118 వద్ద ఆగిపోయింది. టీవీకే 107, కాంగ్రెస్ 5, వామపక్షాలు 4 సీట్లు విజయ్‌కి పూర్తి మద్దతు ప్రకటించాయి. ఈ నేపథ్యంలో, విజయ్‌ని నేడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడానికి ఆహ్వానించలేదని లోక్ భవన్ వర్గాలు తెలిపాయి.

# తెలంగాణ బీజేపీ ఆపరేషన్ ఆకర్ష్

కేంద్రంలో అధికారంలో ఉన్న బలం, రాష్ట్రంలో పెరుగుతున్న ప్రజాదరణను చూపిస్తూ.. భవిష్యత్తులో కాంగ్రెస్‌ను ఢీకొట్టే ఏకైక శక్తి బీజేపీయేనని నాయకులు ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలో బీఆర్‌ఎస్ ఉనికిని క్రమంగా దెబ్బతీస్తూ, ఆ పార్టీకి ఉన్న ప్రధాన ప్రతిపక్ష స్థానాన్ని ఆక్రమించేందుకు కమలనాథులు సిద్ధమయ్యారు.

**- బీఆర్‌ఎస్ సమస్యలు.. బీజేపీకి ప్లస్ అవుతాయా.?**

బీఆర్‌ఎస్ నుంచి వలసలు పెరగడం వల్ల ఆ పార్టీ కేడర్ చెల్లాచెదురవుతోంది. గతంలో కాంగ్రెస్‌ను వ్యతిరేకించిన ఓటర్లు ఇప్పుడు బీఆర్‌ఎస్‌ను బలహీనంగా భావించి, కమలం వైపు చేరుతారని నమ్ముతున్నారు. 2028 నాటికి తెలంగాణలో అధికారం చేపట్టడం అసాధ్యం కాదని పార్టీ గట్టి నమ్మకంతో ఉంది.

ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణలో బీజేపీ గ్రాఫ్ పెరుగుతున్న మాట వాస్తవం. పార్లమెంట్ ఫలితాల జోష్‌ను అలాగే కొనసాగించి, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తేనే మిషన్ 2028 విజయవంతం అవుతుంది. బీఆర్‌ఎస్ పార్టీని పూర్తిగా దెబ్బతీసి, కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టడంలో బీజేపీ ఎంతవరకు సఫలమవుతుందనే దానిపైనే ఆ పార్టీ భవిష్యత్తు ఆధారపడి ఉంది.

# వైఎస్‌ఆర్‌సీపీ పొలిటికల్ రీ బ్రాండింగ్ ప్లాన్

భవనాలకు చదరపు అడుగుకు రూ. 20 వేలకు పైగా ఖర్చు చేయడం భారీ కుంభకోణానికి నిదర్శనమని ఆయన ఆరోపించారు. ఈ అవినీతి ప్రచారాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడం ద్వారా కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచాలని పార్టీ భావిస్తోంది.

**-సోషల్ మీడియాపై ఎక్కువ దృష్టి**

గత వైఎస్సార్‌సీపీ హయాంలో అమలైన సంక్షేమ పథకాలు ఇప్పుడు నీరుగారిపోతున్నాయనే అంశాన్ని జగన్ తన ప్రధాన అస్త్రంగా మార్చుకున్నారు. వచ్చే ఎన్నికల నాటికి యువతను, సోషల్ మీడియా జనరేషన్‌ను ఆకట్టుకోవడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ తన డిజిటల్ విభాగాన్ని ప్రక్షాళన చేస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా వైస్సార్సీపీ సోషల్ మీడియా 2026 పేరిట రిజిస్ట్రేషన్ డ్రైవ్ చేపట్టి, ప్రతి నియోజకవర్గంలో చురుకైన కార్యకర్తలను ఎంపిక చేస్తోంది. ప్రభుత్వ వైఫల్యాలను నిరంతరం ఎండగట్టడం, గత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని పోల్చి చూపడం ద్వారా డిజిటల్ పోరాటం సాగించాలని జగన్ తన కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

**- పాదయాత్ర దిశగా జగన్.. మళ్ళీ ప్రజాక్షేత్రంలోకి!**

అసెంబ్లీలో బలం తక్కువగా ఉన్నా, ప్రజల్లో తనకున్న పట్టు తగ్గలేదని నిరూపించుకునేందుకు జగన్ మళ్ళీ పాదయాత్ర కు సిద్ధమవుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర పూర్తయ్యాక, వైఫల్యాలను ఎండగడుతూ రాష్ట్రవ్యాప్తంగా పర్యటించాలని ఆయన నిర్ణయించుకున్నారు. ఇప్పటికే ఏలూరు వంటి నియోజకవర్గాల నేతలతో వీక్లీ మీటింగ్స్ నిర్వహిస్తూ క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని సిద్ధం చేస్తున్నారు.

ప్రస్తుతానికి వైఎస్సార్‌సీపీ అనుసరిస్తున్న ఈ రీ-బ్రాండింగ్ వ్యూహం క్యాడర్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. అయితే, కేవలం విమర్శలకే పరిమితం కాకుండా, ప్రజల సమస్యలపై నిలకడగా పోరాడటంపైనే పార్టీ భవిష్యత్తు ఆధారపడి ఉంది. ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకతను ఓట్లుగా మలచుకోవాలంటే, జగన్ తన వ్యూహాలను మరింత పకడ్బందీగా అమలు చేయాల్సి ఉంటుంది.

# అంతర్జాతీయ విద్యాభ్యాసానికి పావలా వడ్డీకే రుణాలు

పథకాలపై సమీక్ష సందర్భంగా ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. ఈ నిర్ణయంతో ఐఐటీ, ఐఐఎం, ఎన్ఐటీ వంటి జాతీయ సంస్థలతో పాటు విదేశాల్లోని ప్రతిష్టాత్మక యూనివర్సిటీలలో చదవాలనే విద్యార్థుల కలలు సాకారం కానున్నాయి. కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేలా ప్రోత్సహించాలని, వారికి అవసరమైన శిక్షణ ఇచ్చి ప్రఖ్యాత సంస్థల్లో సీట్లు సాధించేలా చూడాలని సూచించారు. విదేశాల్లో ఉద్యోగాలు సాధించేందుకు వీలుగా ఎస్సీ, ఎస్టీ యువతకు జర్మన్ భాషలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. విద్యతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని, యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించి, ఉపాధి అవకాశాలు మెరుగుపరచడం ద్వారా వారి జీవన ప్రమాణాలను పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని వివరించారు.

**- గృహ నిర్మాణమే లక్ష్యం - ఆగస్టు 15న మెగా ఈవెంట్**

రాష్ట్రంలో గృహ నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. వచ్చే ఆగస్టు 15 నాటికి 2.50 లక్షల ఇళ్లకు సామూహిక గృహ ప్రవేశాలు చేయించాలని, డిసెంబర్ నాటికి మరో 2.38 లక్షల ఇళ్లను సిద్ధం చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. 2027 డిసెంబర్ నాటికి అదనంగా మరో 10 లక్షల ఇళ్లు నిర్మించడమే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. ఇందుకోసం సుమారు 2 లక్షల మందికి కొత్తగా ఇళ్ల స్థలాలు అవసరమవుతాయని, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు కేటాయించాలని ఆదేశించారు.

**- క్రమబద్ధీకరణ ద్వారా వేలాది మందికి ఊరట**

ప్రభుత్వ భూములు, కొండ ప్రాంతాల్లో ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న పేదల ఇళ్లను క్రమబద్ధీకరించాలని ముఖ్యమంత్రి ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రక్రియ పూర్తయితే ఒక్క విజయవాడలోనే 60 వేల మందికి, విశాఖపట్నంలో 30 వేల మందికి లబ్ధి చేకూరుతుందని ఆయన వివరించారు.

ఈ విషయంలో ఏవైనా సాంకేతిక ఇబ్బందులు ఎదురైతే, వాటిని వెంటనే క్యాబినెట్ ఆమోదానికి పంపాలని, సామాన్యుల ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తామని కలెక్టర్లకు భరోసా ఇచ్చారు. అలాగే గుంటూరులో పెండింగ్‌లో ఉన్న 22ఏ భూముల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు.

**- బుడగ జంగాలకు ఎస్సీ ఫలాలు - బీసీలకు రిజర్వేషన్లు**

సామాజిక న్యాయం దిశగా సీఎం చంద్రబాబు కీలక ప్రకటన చేశారు. బుడగ జంగాలను ఎస్సీ జాబితాలో చేర్చడంపై కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తామని, అయితే కేంద్రం నుంచి అనుమతులు వచ్చేలోపు వారికి ఉద్యోగ మినహా ఎస్సీలకు అందే అన్ని ఇతర సంక్షేమ ఫలాలను వర్తింపజేయాలని ఆదేశించారు. బీసీల వెనుకబాటుతనంపై అధ్యయనం చేయడానికి ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేశామని, ఆ నివేదిక ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు తగిన రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చారు. బీసీ హాస్టళ్ల రూపురేఖలు మార్చేలా ఆర్వో ప్లాంట్లు, సీసీ కెమెరాల ఏర్పాటుకు నిధులు కేటాయించినట్లు తెలిపారు.

**- మైనారిటీలకు ఆటోనగర్లు - ఉపాధి హబ్‌లు**

మైనారిటీల ఆర్థికాభివృద్ధికి సంబంధించి సీఎం సరికొత్త ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లోనూ ముస్లిం జనాభా ఉన్న ప్రాంతాల్లో రూరల్ ఆటోనగర్ లను ఏర్పాటు చేయాలని సూచించారు. వీటిని వక్ఫ్ బోర్డు భూముల్లో నిర్మించి, మైనారిటీ యువతకు లైవ్ లీ హుడ్ హబ్ లుగా మార్చడం ద్వారా పారిశ్రామికాభివృద్ధికి తోడ్పడాలని అధికారులను ఆదేశించారు. ముస్లిం మైనారిటీల నైపుణ్యాన్ని సద్వినియోగం చేసుకునేలా ఈ పారిశ్రామిక వాడలను తీర్చిదిద్దాలని కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు.

**- సమ్మర్ ప్లాన్ , కేంద్ర పథకాల అనుసంధానం**

వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా 'సమ్మర్ యాక్షన్ ప్లాన్'పై సీఎం సమీక్షించారు. జలధార, పశుగ్రాసం వంటి పథకాలను కేంద్ర ప్రభుత్వ పథకాలతో అనుసంధానం చేసి గరిష్ట ప్రయోజనం పొందాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రభుత్వ ప్రాధాన్యతలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, పరిపాలనలో పారదర్శకతను పాటిస్తూ నిర్ణీత గడువులోగా లక్ష్యాలను చేరుకోవాలని చంద్రబాబు స్పష్టం చేశారు.

# కొడంగల్‌ను బంగారు తునకగా మార్చుకుందాం

గురైన పరిస్థితులను వివరిస్తూ, ప్రస్తుతం చేపట్టిన పనుల గురించి సమగ్రంగా వివరించారు. దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన ఈ ప్రాంతంలో మెడికల్, ఇంజనీరింగ్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటీఐలు, సైనిక్ స్కూల్స్.. 225 ఎకరాల్లో ఒక ఎడ్యుకేషనల్ హబ్ తీర్చిదిద్దబోతున్నామని చెప్పారు. అతివేగంగా పనులు జరుగుతున్నాయని చెబుతూ ఏడాది లోపు పనులన్నీ పూర్తి కావాలని ఆదేశించారు. ఆనాడు చదువుకోవడానికి ఈ ప్రాంత వాసులు రాష్ట్రం నలుమూలల వెళ్లాల్సిన పరిస్థితి నుంచి ఈనాడు రాష్ట్రం నలుమూలల నుండి మంచి చదువుల కోసం కొడంగల్‌కు రావలసిన విధంగా పనులు చేపట్టామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

**- దేశంలో ఉండే గొప్ప ప్రాజెక్టులు రప్పిస్తా**

'ఇప్పుడు ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకునే అవకాశం వచ్చింది. మక్తల్ – నారాయణపేట – కొడంగల్‌కు నీళ్లు, రైల్వే లైన్, సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు అవకాశం వచ్చింది. దేశంలో ఉండే గొప్ప గొప్ప పరిశ్రమలు రాబోయే రెండేళ్లలో ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి'అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 'మక్తల్ – నారాయణపేట్ – కొడంగల్ ప్రాజెక్టును పూర్తి చేయాలి. కృష్ణా నది జలాలతో ఈ ప్రాంత భూములు తడవాలి. దీనికి జిల్లా ఇంచార్జి మంత్రి రాజనర్సింహ ప్రతి నెల సమీక్ష నిర్వహించాలని కోరుతున్నా.

భూ సేకరణ పూర్తి చేసినం. అనుమతులు అన్నీ వచ్చాయి. పనులు ముందుకు సాగాలి'అని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.'ఇప్పుడు నిధులకు అడ్డంకి లేదు. అన్ని మండలాలకు నీళ్లు తెచ్చుకునే అవకాశం ఉంది. పనులు వేగంగా జరిగే విధంగా సర్పంచులు, స్థానిక ప్రతినిధులు చురుకుగా పనిచేయాలి. కృష్ణా – వికారాబాద్ రైల్వే లైన్‌కు కూడా సూత్రప్రాయంగా అనుమతి తెచ్చుకున్నాం'అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

**- బేధాభిప్రాయాలు పక్కనపెట్టి కలిసికట్టుగా ఉండాలి**

'కొడంగల్ ప్రాంతంలో అపారమైన సున్నపురాయి ఉంది. టేకులగోడు ప్రాంతంలో పెద్ద ఎత్తున సిమెంట్ పరిశ్రమకు అన్ని అనుమతులు ఇచ్చినం. రాబోయే ఆర్నెళ్లలో సిమెంట్ పరిశ్రమ నిర్మాణం జరిగితే స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయి'అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 'పెద్ద ఇండస్ట్రియల్ పార్క్‌ను లగచర్ల దగ్గర కట్టుకుంటున్నాం. కోస్గీ నుండి నేరుగా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ వరకు 300 అడుగుల రోడ్డు వేస్తున్నాం అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ప్రతి ఊర్లో చిన్న సమస్యలు, బేదాభిప్రాయాలు ఉంటాయి. అవన్నీ పక్కన పెట్టి మీరంతా కలిసి కట్టుగా ఉండాలి. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవాలి' అని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

**- ఏదోఒక విడిదికి సుందర వరదాచార్యుల పేరు**

'కొడంగల్ నియోజకవర్గ పరిధిలో 55 ఏళ్ల కిందట కీ.శే. నందారం నర్సింహులు ప్రారంభించిన ఈ పేదల తిరుపతిని, తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో పునర్నిర్మించే ఒక బృహత్తరమైన స్వామి కార్యాన్ని చేపట్టాం. ఇది జీవితంలో మళ్లీ రాని గొప్ప అవకాశం'అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.'తెలంగాణ పేదల తిరుపతిగా దీన్ని అభివృద్ధి చేయాలని చాలా మంది నాయకులు కలలు కన్నారు. వివిధ కారణాల చేత ఎప్పటికప్పుడు వాయిదా పడుతూ వచ్చింది. దేశం గర్వించదగిన ఆగమశాస్త్ర సలహాదారులు సుందర వరదాచార్యులు ఇక్కడ వీధుల్లో రథాన్ని తిప్పడానికి మీరు బాధ్యత తీసుకోవాలని నన్ను కోరడంతో ఆ కార్యక్రమాన్ని చేపట్టాం'అని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు.'ఇప్పుడాయన మన మధ్యలో లేకపోవడం తీరని లోటు. సుందర వరదాచార్యులు చివరి కోరికను తీర్చడంతో పాటు, వారిని ఈ ప్రాంతం, ఈ సమాజం గుర్తు పెట్టుకునే విధంగా మందిరాన్ని తీర్చిదిద్దుతాం. అలాగే సుందర వరదాచార్యులు పేరు ఈ ప్రాంగణంలో ఏదో ఒక విడిదికి పెట్టాలి'అని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి దేవాదాయ శాఖ అధికారులకు, జిల్లా కలెక్టర్‌కి సూచించారు.

**- కొడంగల్ ఖ్యాతిని దేశస్థాయిలో విస్తరిస్తాం**

'ఈ కార్యక్రమం రాజకీయాలకు అతీతమైనది. జెండా, అజెండాలకు సంబంధించినది కాదు. ఇది మన ప్రాంతం, రాష్ట్రం గర్వించదగ్గ ఒక గొప్ప అభివృద్ధి కార్యక్రమం. ఇక్కడి వారినే కాదు. కర్ణాటక, మహారాష్ట్ర నుండి వచ్చే ప్రజలను కూడా ఆశీర్వదించడానికి ఒక గొప్ప దైవ కార్యం'అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. కొడంగల్ శాసనసభ నియోజకవర్గ ప్రతిష్టను దేశ స్థాయిలో విస్తరించడానికి ఇది దోహదపడుతుందని భావిస్తున్నా. ఈనాడు తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయి కొడంగల్ బిడ్డ మీ ముందు నిలబడ్డా'అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

**-పలు కార్యక్రమాలకు శంకుస్థాపన**

అంతకుముందు పేదల తిరుపతిగా ఖ్యాతి పొందిన కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలోని శ్రీమహాలక్ష్మీ వెంకటేశ్వరస్వామి (కొడంగల్ బాలాజీ) ఆలయ పునర్నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వేదపండితుల సమక్షంలో నిర్వహించిన భూమి పూజ, యాగంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. కొడంగల్ బాలాజీ ఆలయ పునర్నిర్మాణంతో పాటు కొడంగల్ లో 430 పడకల ఆసుపత్రి నిర్మాణం, దౌల్తాబాద్ వెంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణం, కోస్గి వేణుగోపాలస్వామి ఆలయాల అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతూ శిలాఫలకాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు.

# జూబ్లీ హిల్స్ క్రైమ్ లో నేపాలీ ముఠా

తెల్లవారుజామున రెండు గంటలకు జరిగిందని ఆయన వివరించారు. ఈ కేసు దర్యాప్తు పురోగతిని, ప్రాథమిక సమాచారాన్ని ఆయన మీడియాకు తెలిపారు.

**- నేపాలీ ముఠా ప్రమేయం ఉందన్న సీపీ సజ్జనార్**

ప్రాథమిక విచారణలో నేపాలీ ముఠా ప్రమేయం ఉందని పోలీసులు గుర్తించినట్టు ఎజూ సజ్జనార్ తెలిపారు. ఇంట్లో పనిచేస్తున్న కల్పన (నేపాలీ మహిళ) సహాయంతో బయటి దుండగులు ఈ హత్యకు పాల్పడ్డారని సీపీ సజ్జనార్ వెల్లడించారు. నిందితులు ఇంటి వెనుక గేటు నుండి లోనికి ప్రవేశించారని స్పష్టం చేశారు. ఘటన సమయంలో పిల్లలు పై అంతస్తులో నిద్రించగా, తనూజ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్నారు.

**- చేతులు కట్టేసి, నోట్లో గుడ్డలు కుక్కి దారుణ హత్య**

చేతులు కట్టేసి, నోట్లో గుడ్డలు కుక్కి ఊపిరాడకుండా చేసి ఆమెను దారుణంగా హత్య చేశారు. ప్రస్తుతం ఈ కేసులో ఎంత బంగారం, నగదు పోయిందనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ప్రజలు భయాందోళనలకు గురికావద్దని, నిందితులను త్వరలోనే పట్టుకుంటామని సీపీ సజ్జనార్ హామీ ఇచ్చారు.

**- నేపాలీ పని మనుషులతో జాగ్రత్తగా ఉండాలన్న సీపీ సజ్జనార్**

నేపాలీ పనిమనుషులతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఇంట్లో ఎవరూ లేనప్పుడు వారు నేరాలకు పాల్పడతారని, ఏడాది, రెండేళ్లుగా పని చేసినా వారి పైన నిఘా తప్పనిసరి అన్నారు. బెంగళూరు, ముంబై, పుణేలోనూ ఇలాంటి నేరాలు జరుగుతాయని గుర్తుచేస్తూ నిందితులను పట్టుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన స్పష్టం చేశారు.

# కేటీఆర్‌లా దోచుకోవడం, దాచుకోవడం తెలియదు

తెలియదని అన్నారు. వారిలా డ్రగ్స్ తీసుకోవడం కూడా తనకు తెలియదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం, ఫార్ములా ఈ రేస్ కేసు, విద్యుత్ కొనుగోళ్లలో అవినీతి చేయడం తమకు తెలియదని ఎద్దేవా చేశారు. కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకోవాలని లేదంటే పరిస్థితులు మరోలా ఉంటాయని హెచ్చరించారు. వారి అహంకారం వల్లనే కేసీఆర్ ఓడిపోయి ఫామ్ హౌస్?కు పరిమితమయ్యారని వ్యాఖ్యానించారు. వరుస ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతున్నప్పటికీ కేటీఆర్‌లో మార్పు రావడం లేదని వ్యాఖ్యానించారు.

పరేడ్ మైదానంలో ఈ నెల 10వ తేదీన జరగబోయే ప్రధాని నరేంద్రమోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్రం వేల కోట్ల రూపాయల నిధులు ఇస్తోందని అన్నారు. కేంద్ర నిధులతో తెలంగాణలో అంతో ఇంతో అభివృద్ధి జరుగుతోందని అన్నారు. కేంద్రం నిధులివ్వకపోతే తెలంగాణ అభివృద్ధి చెందుతుందా అని ప్రశ్నించారు. తెలంగాణ అభివృద్ధి కోసం మేం ఢిల్లీ నుంచి నిధులు తెస్తుంటే, కాంగ్రెస్ వాళ్లు మాత్రం ఇక్కడి నిధులను అధిష్ఠానానికి పంపుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీని నడుపుకోవడానికి తెలంగాణ సొమ్ము ఉపయోగించుకుంటున్నారని ధ్వజమెత్తారు. డబుల్ ఇంజిన్ సర్కారుతో తెలంగాణ మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. మోదీ తెలంగాణ అభివృద్ధి కోసమే వస్తున్నారని బండి సంజయ్ అన్నారు.

# బెంగాల్ తొలి బీజేపీ సీఎంగా సువేందు

కోల్‌కతా (ప్రశ్న న్యూస్) పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో నవశకం మొదలైంది. రాష్ట్ర తొలి బీజేపీ ముఖ్యమంత్రిగా సువేందు అధికారి బాధ్యతలు చేపట్టనున్నారు. కోల్‌కతాలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సమక్షంలో బీజేపీ శాసనసభాపక్ష సమావేశం జరిగింది. అనంతరం బెంగాల్ సీఎంగా సువేందు అధికారి పేరును అమిత్ షా ప్రకటించారు.

సీఎంతో పాటు ఇద్దరు ఉప ముఖ్యమంత్రులను కూడా నియమించాలని అధిష్టానం నిర్ణయం తీసుకుంది. ఇక నేడు ఉదయం 11 గంటలకు కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో అట్టహాసంగా ప్రమాణ స్వీకారోత్సవం జరగనుంది. ఈ చారిత్రాత్మక వేడుకకు ప్రధాని మోదీతో పాటు బీజేపీ అగ్రనాయకులు హాజరయ్యే అవకాశం ఉంది. గతంలో మమతా బెనర్జీని రెండుసార్లు ఎమ్మెల్యేగా ఓడించిన సువేందుకే ఈ కీలక బాధ్యతలు దక్కడం విశేషం. దశాబ్దాల నిరీక్షణ తర్వాత బెంగాల్ గడ్డపై కమలం వికసించి బీజేపీ సర్కార్ కొలువుదీరబోతోంది.

**- కౌన్సిలర్ నుండి సీఎం వరకు.. సువేందు ప్రస్థానం**

పశ్చిమ బెంగాల్ నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్న సువేందు అధికారి రాజకీయ ప్రస్థానం సంచలనాల సమాహారం.?

1970లో పుర్బా మేదినీపూర్ జిల్లాలో జన్మించిన ఈయన, మాజీ కేంద్ర మంత్రి సిసిర్ అధికారి వారసుడు. 1995లో కాంగ్రెస్ కౌన్సిలర్‌గా ప్రయాణం మొదలుపెట్టి, 1998లో తృణమూల్ కాంగ్రెస్‌లో చేరారు.

2006లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2007 నందిగ్రామ్ భూపోరాటంలో కీలక పాత్ర పోషించి మమతా బెనర్జీ విజయానికి బలమైన పునాదులు వేశారు. రాష్ట్ర మంత్రిగా రవాణా, నీటిపారుదల శాఖలను సమర్థవంతంగా నిర్వహించిన ఈయన, 2020లో బీజేపీలో చేరారు. 2021 ఎన్నికల్లో నందిగ్రామ్‌లో సాక్షాత్తూ మమతా బెనర్జీని ఓడించి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించారు. గత ఐదేళ్లు అసెంబ్లీ ప్రతిపక్ష నేతగా బెంగాల్ ప్రభుత్వ వ్యతిరేక గళాన్ని బలంగా వినిపించారు.

తాజా 2026 ఎన్నికల్లో నందిగ్రామ్, భవానీపూర్ రెండు స్థానాల్లోనూ మమతను ఢీకొట్టి బీజేపీని చారిత్రక విజయపథంలో నడిపించారు. తూర్పు మేదినీపూర్ ప్రాంతంలో తిరుగులేని రాజకీయ పట్టున్న సువేందు, ఇప్పుడు బెంగాల్ గడ్డపై కమల సేనను అధికార పీఠంపై కూర్చోబెట్టి చరిత్ర సృష్టించారు.

# కవిత వర్సెస్ కేటీఆర్

వారిద్దరూ ఒకే పార్టీలో ఉంటే ఆ పార్టీకి లాభం జరుగుతుంది. కానీ కవిత బిఆర్ఎస్ పార్టీ నుండి తనను సస్పెండ్ చేయడంతో కొత్త రాజకీయ పార్టీ పెట్టి కేటీఆర్ ను, కేసీఆర్ ను టార్గెట్ చేయడంతో రాజకీయం రసవత్తరంగా మారింది. ఈ సమయంలో కేటీఆర్, కవితలలో ఎవరు తెలివైన వారు. రాజకీయంగా ఎవరి బలం ఏంటి? కవిత కేటీఆర్ లలో ఎవరి ప్రభావం ప్రజలపైన ఎక్కువగా ఉంటుందన్నది ఆసక్తికరంగా మారింది.

**- కేటీఆర్ బలం ఇదే**

రాజకీయంగా కేటీఆర్, కవిత ఇద్దరు హేమాహేమీలే. కేటీఆర్ వ్యూహాత్మక రాజకీయాలలో ముందుంటారు. గత ప్రభుత్వ హయాంలో పదేళ్ల పాలనలో పాలసీలు, అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ వంటి అనేక అంశాలలో పక్కా ప్లానింగ్ తో తనదైన మార్క్ చూపించారు. కేటీఆర్ నగర యువత, ఐటీ ప్రొఫెషనల్స్, మధ్యతరగతి వర్గాలలో మంచి ఇమేజ్ ను కలిగి ఉన్నారు.

**- స్ట్రాటజీలతో పనిచేసే నాయకుడు కేటీఆర్**

స్పష్టమైన, లాజికల్ కమ్యూనికేషన్ తో ప్రజలను ఆకట్టుకోవడంలో ఆయన దిట్ట. మీడియాను, సోషల్ మీడియాను వినియోగించడంలో ముందు వరుసలో ఉండే నాయకుడు కేటీఆర్. పార్టీ లైన్లో పనిచేసే, సంక్లిష్ట పరిస్థితులలో స్ట్రాటజీ లతో పనిచేసే నాయకుడు కేటీఆర్.

**- భావోద్వేగంతోనే బలంగా కవిత**

ఇక కవిత విషయానికి వస్తే కవిత భావోద్వేగ అనుబంధాన్ని బలంగా ఉపయోగించగలిగిన రాజకీయ నేత. ప్రజల సమస్యల పైన స్పందించడం, సాంస్కృతిక అంశాల ద్వారా కనెక్ట్ అవ్వడం కవిత కు ఉన్న ప్రత్యేకత. గ్రామీణ ప్రాంతాలు, మహిళలు, సాంప్రదాయ వర్గాలలో ఎక్కువ ప్రభావం చూపించగల కవిత, క్షేత్రస్థాయిలో కి వెళ్లి ప్రజలతో కనెక్ట్ అవ్వ గలిగిన నేత.

**- పరిస్థితులకు తగ్గట్టు స్పందించే నేత కవిత**

కవిత కమ్యూనికేషన్లో భావోద్వేగం ఉంటుంది. సాంస్కృతిక టచ్ కూడా ఎక్కువగా ఉంటుంది. ఇది ప్రజలతో బలమైన అనుబంధాన్ని సృష్టించడానికి వీలవుతుంది. పరిస్థితులకు అనుగుణంగా, అవసరాన్ని బట్టి తన భావాలను ప్రతిబింబిస్తారు కవిత. ఇక ఇద్దరు ప్రజలను ఇన్ఫ్లుయెన్స్ చేయగలిగిన లీడర్స్ కావడంతో భవిష్యత్తులో ఎవరి వైపు ప్రజలు ఎక్కువగా మొగ్గు చూపుతారు అన్నది ఆసక్తిగా మారింది.

# ఎస్ఐఆర్తో రాష్ట్రంలో ఓట్లు తొలగించేందుకు కుట్ర

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఓటర్ల ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) పేరుతో తెలంగాణలో ఓట్లు తొలగించాలని చూస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఇతర రాష్ట్రాల్లో జరిగిన విధంగా తెలంగాణలో జరగనీయవద్దని, అందరూ కలిసి కట్టుగా ఎదుర్కోవాలని మైనారిటీల కార్యక్రమంలో ముఖ్యమంత్రి పేర్కొన్నారు. హజ్ వెళ్తున్న బస్సులకు సీఎం రేవంత్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. సంక్షేమం, ఉద్యోగాల్లో మైనారిటీల వాటా వారికి ఇస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ఇరాన్, ఇరాక్ యుద్ధంతో పెరిగిన విమాన ఛార్జీల భారం హజ్ యాత్రికులపై పడకుండా ప్రభుత్వమే భరిస్తోందన్నారు. గతేడాది హజ్కు వెళ్లిన బస్సు ప్రమాదంలో 44 మంది మరణిస్తే మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం ఇచ్చినట్లు ప్రస్తావించారు.

**- ఈవీ ఆటోలుగా మార్చేందుకు సన్నాహాలు**

ప్రస్తుతం వైట్ కాలర్ జాబ్స్ కంటే బ్లూ కాలర్ జాబ్స్‌కు డిమాండ్ ఎక్కువగా ఉందన్న సీఎం, అమెరికా కంటే జర్మనీ, జపాన్‌లో ఎక్కువ ఉద్యోగావకాశాలు ఉన్నాయన్నారు. అందుకే ఐటీఐలను ఏటీసీలుగా అప్గ్రేడ్ చేసి యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తున్నామని సీఎం చెప్పారు. హైదరాబాద్‌లో చాలా మంది మైనారిటీలు ఆటోలు నడుపుతున్నారని, ఓఆర్ఆర్ లోపల ఉన్న అన్ని ఆటోలను ఉచితంగా ఈవీ ఆటోలుగా మార్చాలని నిర్ణయించినట్లు తెలిపారు. తమకు హిందూ, ముస్లిం బేధాభిప్రాయం లేదని, హిందూ, ముస్లిం భాయీభాయీ అని సీఎం అన్నారు. కార్యక్రమంలో మంత్రి అజారుద్దీన్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

**- ప్రోత్సాహకాలకు ప్రత్యేక కార్యక్రమం**

అంతకుముందు మైనారిటీ సంక్షేమ శాఖపై సచివాలయంలో సమీక్ష నిర్వహించిన సీఎం, ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో మైనార్టీలకు ప్రత్యేక డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేసి, వాటిలో నైపుణాభివృద్ధి, ఏఐ శిక్షణకు ప్రాధాన్యమివ్వాలని అధికారులను ఆదేశించారు. సంప్రదాయ కోర్సులు కాకుండా, జీవనోపాధికి ఉపయోగపడే శిక్షణ ఇప్పించాలన్నారు. ప్రతిభావంతులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల తరహాలోనే మైనారిటీలకూ ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు ప్రత్యేకంగా ఒక కార్యక్రమం ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. ఆ కార్యక్రమానికి గ్రూప్సనకు ఎంపికైన వారిని, క్రీడాకారులను ఆహ్వానించి విద్యా, క్రీడల ప్రాధాన్యతను తెలియజేయాలని సూచించారు.

**- ఖబరస్తాన్లకు భూ కేటాయింపు**

గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3కి ఎంపికైన మైనారిటీల్లో ఆసక్తి ఉన్న వారికి మైనారిటీ సంక్షేమ శాఖలో బాధ్యతలు అప్పగించి, ఆ శాఖ పరిధిలోని అన్ని కార్యక్రమాలపై పూర్తి అవగాహన కలిగించేలా వారిని తీర్చిదిద్దాలని సీఎం ఆదేశించారు. ఇమామ్, మౌజమ్‌లకు ఇచ్చే గౌరవ పారితోషికాలను క్రమం తప్పకుండా విడుదల చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. మైనారిటీ పాఠశాలల్లో బోధనలో ఏఐకి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. భూమి అందుబాటులో ఉన్న చోట ఖబరస్తాన్‌లకు కేటాయిస్తామని సీఎం తెలిపారు. డీజిల్, పెట్రోల్ ఆటోలను ఎలక్ట్రిక్ ఇంజిన్లతో రీట్రోఫిట్టింగ్ చేయడం ద్వారా ఆటోడ్రైవర్లకు ఇంధన ఖర్చులు లేకుండా చేసి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచే లక్ష్యంతో ప్రణాళిక రూపొందిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.మూసీ రివర్ ఫ్రంట్‌లో భాగంగా గుడితో పాటు మసీద్, చర్చి, గురుద్వారా నిర్మాణాలు చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆయా మతాల సంస్కృతుల అధ్యయనం, భారత దేశ విశిష్టతను, తెలంగాణలోని గంగా జమునా తెహ్జీబ్ను తెలియజేసేలా ఆ కట్టడాలు ఉండాలని సీఎం అన్నారు. మన సంస్కృతులను అధ్యయనం చేసే గొప్ప కేంద్రాలుగా ఉండాలని ఆకాంక్షించారు. సమీక్షలో మంత్రి అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సీఎస్ రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామంలోకి రాకుండా హిజ్రాలపై నిషేధం.



**హైదరాబాద్** తెలంగాణలో హిజ్రాల ఆగడాలు శ్రుతిమించడంతో నిజామాబాద్ జిల్లా భీమగల్ మండలం బడా భీమగల్ గ్రామ పెద్దలు కీలక నిర్ణయం తీసుకున్నారు. వారు ఊర్లోకి రాకుండా నిషేధం విధిస్తూ గ్రామ అభివృద్ధి కమిటీ విడిసి తీర్మానం చేసింది. పెళ్లిళ్లు, గృహప్రవేశాలు,ఇతర శుభకార్యాల సమయంలో రూ.వేలల్లో డబ్బులు డిమాండ్ చేస్తూ వేధింపులకు గురిచేస్తుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. మరి మీ ఏరియాలోనూ హిజ్రాల ఇబ్బందులు ఉన్నాయా.

## మల్లారెడ్డి విశ్వవిద్యాపీఠ్‌లో

# ఏఐ ఆధారిత కోర్సులు

**కుత్బుల్లాపూర్** విద్యార్థుల భవిష్యత్తు కోసం ంఎ ఆధారిత కోర్సులను ప్రవేశపెట్టేందుకు మల్లారెడ్డి విశ్వ విద్యాపీఠ్ కృషి చేస్తోందని అన్నారు మల్లారెడ్డి విశ్వ విద్యాపీఠ్ చైర్మెన్ డా భద్రారెడ్డి. ఈ సందర్భంగా సూరారం,మల్లారెడ్డి విశ్వ విద్యాపీఠ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ సౌత్ ఇండియాలోనే మొట్టమొదటి సారిగా ంఎ టెక్నాలజీ తో కూడిన విద్యను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. వైస్ ఛాన్సలర్ ప్రీతి రెడ్డి మాట్లాడుతూ?ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ంఎ) లో అగ్రగామి సంస్థ అయిన ఇఖీూా ంఎ ఎఎఆజం తో కలసి ప్రత్యేక కోర్సులను రూపొందించాని,ఈ ప్రోగ్రామ్ ద్వారా విద్యార్థులు థియరీ మాత్రమే కాకుండా ంఎ టూల్స్ ను ఎలా వాడాలి,గ్లోబల్ మార్కెట్ లో ఎలాంటి కంటెంటు రూపొందించాలి అనే విషయాలపై పూర్తి స్థాయిలో శిక్షణ పొందుతారని తెలిపారు. ఇంటర్ పూర్తి చేసిన ప్రతి ఒక్కరు ఈ కోర్సుకు అర్హులని,ంఎ పై ఆసక్తి గల వారు ఈ కోర్సుల ద్వారా మంచి అవకాశాలను పొందవచ్చు అని తెలిపారు.

# వైకాపా నేతలపై కేసులు పెడుతున్నారు

**విశాఖపట్నం** స్పీకర్ అయ్యన్నపాత్రుడు అనుచరులే దాడి చేసి తమ నాయకులపై కేసులు పెట్టడం దారుణమని మాజీ మంత్రి అమర్ నాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా స్పీకర్ సొంత నియోజకవర్గంలో అక్రమ అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. ఎల్లకాలం ఒకేలా ఉండదని, భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. చర్యకు ప్రతి చర్య ఉంటుందన్న విషయం టీడీపీ నాయకులు గుర్తించుకోవాలని సూచించారు.

# విశాఖలో ఎన్జీజీవో భవనం ప్రారంభం

**విశాఖపట్నం** రాష్ట్రంలో ఏపీఎన్‌జీజీఓ భవణాలను ఉద్యోగులకు ఉపయోగకరంగా ఉండేలా తీర్చిదిద్దామని రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ తెలిపారు.విశాఖలో ఏపీఎన్‌జీజీఓ నూతన భవణాన్ని ప్రారంభించిన ఆయన మీడియాతో మాట్లాడుతూ ... ఉద్యోగ ఉపాధ్యాయులు సమస్యల పరిష్కరించేలా కృషి చేస్తామని,పదవీ విరమణ బకాయిలను కూడా పెండింగ్ లో ఉన్నాయని,కూటమి ప్రభుత్వ హయాంలో ఉద్యోగులకు న్యాయం చేసేలా ఒత్తిడి తెస్తామని అన్నారు.పెండింగ్ లో ఉన్న సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

# కేకే లైన్‌ను రాయగడ డివిజన్ లో కలపొద్దు

**విశాఖపట్నం** దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేయడాన్ని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం. జగ్గునాయుడు స్వాగతించారు. అయితే, కొత్తవలస-కిరండూల్ కేకే లైన్, అరకు, బొర్రా గుహల ప్రాంతాలను విశాఖ డివిజన్ నుండి విడదీసి రాయగడ డివిజన్‌లో కలపడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు.మద్దిలపాలెంలోని ఏచూరి భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేకే లైన్‌ను తరలించడం విశాఖ ప్రజలకు అన్యాయం చేయడమేనని, ఆ ప్రాంతాలను విశాఖ డివిజన్‌లోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు.

## జూన్ 1 నుంచి విశాఖ కేంద్రంగా

# దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు

**విశాఖపట్నం** విశాఖ కేంద్రంగా జూన్ 1 నుంచి దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభం కానున్నట్లు ఎంపీ భరత్ వెల్లడించారు. ఇచ్చిన హామీ మేరకు వాల్తేరు డివిజన్‌ను కాపాడుకున్నామన్నారు. జోన్ వల్ల విశాఖ నుంచి మరికొన్ని కొత్త రైళ్లు అడగవచ్చని, విశాఖ నుంచి బెంగళూరుకు రోజూ సర్వీసులు నడిపే ఆలోచన చేస్తున్నామన్నారు. అలాగే విశాఖ నుంచి తిరుపతికి వందేభారత్ అడుగుతామని తెలిపారు.వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తెలుగుదేశం పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలో రైల్వేజోన్ విషయంలో ఎందుకు సీరియస్‌గా తీసుకోలేదని ప్రశ్నించారు.జగన్ అండ్ కో పరిపాలన అంటే ఏమీ తెలియదని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు ఏమి చేయకపోయినా.. ప్రతిపక్షంలోకి వచ్చినప్పుడు మాత్రం అన్ని చేయాలని అంటారని ఎద్దేవా చేశారు. జూన్ ఒకటి నుంచి రైల్వేజోన్ కార్యకలాపాలు ప్రారంభమవుతాయని తెలిపారు. గెజిట్ రావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. రైల్వేజోన్ రావడమే కాదని.. విశాఖ డివిజన్ కూడా వచ్చిందని ప్రస్తావించారు. అభివృద్ధి అంటే ఏమిటో తెలియని పార్టీ వైసీపీ అని విమర్శించారు. జగన్ అండ్ కో క్రెడిట్ చోరీకి పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రతిదీ తామే తెచ్చామని గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని సెటైర్లు గుప్పించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీకి లక్ష కోట్ల ప్రాజెక్టులు వచ్చాయని ఎంపీ శ్రీభరత్ పేర్కొన్నారు.

## అక్రమ గోవుల రవాణాన్ని

# అడ్డుకున్న కరాటే కళ్యాణి

**అనకాపల్లి** అనకాపల్లి జిల్లా నక్కపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా గోవులను తరలిస్తున్న మూడు బొలెరో వాహనాలను సినీ నటి కరాటే కల్యాణి అడ్డుకున్నారు. జాతీయ రహదారిపై గోవులను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో ఆమె తన బృందంతో కలిసి వాహనాలను నిలిపివేసి పోలీసులకు సమాచారం అందించారు.

ఈ వాహనాల్లో నిబంధనలకు విరుద్ధంగా, అత్యంత కిక్కిరిసిన రీతిలో గోవులను తరలిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వాహనాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. గోరక్షణలో భాగంగా తాము ఈ చర్య తీసుకున్నామని ఆమె పేర్కొన్నారు, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బాధ్యతాయుతంగా

# విధులు నిర్వహించాలి

**- వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్,**

**వరంగల్** ఉద్యోగంలో స్థాయి పెరిగిన కొద్దీ బాధ్యతలు కూడా పెరుగుతాయని, ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించే దిశగా అధికారులు కృషి చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, ఐపీఎస్ గారు సూచించారు.వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇటీవల ఏఎస్సై స్థాయి నుంచి సబ్ ఇన్స్పెక్టర్లుగా పదోన్నతి పొందిన 25 మంది అధికారులు శుక్రవారం పోలీస్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. అనంతరం పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా పదోన్నతి పొందిన ఎస్.ఐ భుజాలపై నక్షత్ర చిహ్నాలను అలంకరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, పదోన్నతులు కేవలం హోదా పెరుగుదల మాత్రమే కాకుండా ప్రజల పట్ల మరింత బాధ్యతతో పనిచేసే అవకాశం అని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను సానుభూతితో వినడం, చట్టపరంగా వేగవంతమైన చర్యలు తీసుకోవడం, పోలీస్ శాఖ ప్రతిష్టను పెంచే విధంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండే పోలీసింగ్ విధానాన్ని అవలంబిస్తూ, బాధితులకు తక్షణ సహాయం అందించాలన్నారు. కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి అధికారి కీలక పాత్ర పోషించాలని, విధుల్లో క్రమశిక్షణ, నిజాయితీ, నిబద్ధతతో పనిచేయాలని ఆయన సూచించారు.నూతనంగా పదోన్నతి పొందిన అధికారులు తమపై ఉన్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సీపీ తెలిపారు

# కొడంగల్‌లో తిరుమల తరహాలో శ్రీనివాస ఆలయం

**మహబూబ్ నగర్,** కొడంగల్‌లో రూ. 110 కోట్ల ఖర్చుతో పునర్ నిర్మించనున్న వెంకటేశ్వర స్వామి దేవాలయానికి భూమి పూజ చేశారు. కొడంగల్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర భక్తులకు పేదల తిరుపతి గా విరాజిల్లుతోందని రేవంత్ రెడ్డి అన్నారు. తిరుమలలో అనుసరించే ఆగమశాస్త్ర సంప్రదాయాల ప్రకారమే ఇక్కడ కూడా పూజా కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆలయ అభివృద్ధికి సహకరించిన దివంగత ఆగమశాస్త్ర సలహాదారులు సుందరవరదాచార్యుల గుర్తుగా ఒక విడిది కేంద్రానికి వారి పేరు పెట్టాలని సూచించారు. ఆధ్యాత్మికతతో పాటు నియోజకవర్గ రూపురేఖలను మార్చేలా అభివృద్ధి పనులు వేగవంతం చేస్తామని ప్రకటించారు. తాను ఈ స్థాయికి రావడానికి కొడంగల్ కార్యకర్తల రక్తమోడ్చిన శ్రమ, ప్రజల ఆశీర్వాదమే కారణమని సీఎం గుర్తుచేసుకున్నారు. రోజుకు 18 గంటలు కష్టపడుతూ రైతు రుణమాఫీ, సన్నబియ్యం, రైతు భరోసా వంటి సంక్షేమ పథకాలను ఇంటింటికీ చేరుస్తున్నామని తెలిపారు. ఒకప్పుడు వలసలకు నిలయమైన కొడంగల్‌లో ఇప్పుడు విద్యా, వైద్య రంగాలు కుదురుకుంటున్నాయని.. మెడికల్, ఇంజనీరింగ్ కాలేజీలు, సైనిక్ స్కూల్ వంటి సంస్థలతో ఏడాదిన్నరలో కొడంగల్ ఎడ్యుకేషన్ హబ్ గా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు.కొడంగల్ పారిశ్రామిక, వ్యవసాయ అభివృద్ధిపై సీఎం స్పష్టమైన రోడ్ మ్యాప్ ఇచ్చారు. నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని ఏడాదిన్నరలోనే పూర్తి చేసి కృష్ణా జలాలను పారించి తీరుతామని స్పష్టం చేశారు. లగచర్ల వద్ద 2300 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయడంతో పాటు, ఆరు నెలల్లో సిమెంట్ పరిశ్రమ పనులు ప్రారంభమవుతాయని, తద్వారా స్థానిక యువతకు ఉపాధి లభిస్తుందని వెల్లడించారు. ఎయిర్‌పోర్టు నుంచి కొడంగల్‌కు భారీ రోడ్డు మార్గాన్ని నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. చిన్న చిన్న రాజకీయ విభేదాలను పక్కన పెట్టి, నియోజకవర్గ ప్రగతి కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. సర్పంచ్‌లు ఏ పార్టీ వారైనా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసుకోవాలని సూచించారు. 2009లో తాను నాటిన మొక్క ఇప్పుడు పెద్ద చెట్టుగా మారిందని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత కార్యకర్తలపైనే ఉందన్నారు. 2027 డిసెంబర్ లోగా కొడంగల్‌లో పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను పూర్తి చేసి, ఈ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలుపుతానని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు.

## వరంగల్‌లో పురాతన ఆలయం కూల్చివేత వివాదం..

# కలెక్టరేట్ కీలక ప్రకటన

**వరంగల్,** వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలం పహాడ్ల అశోక్ నగర్‌లో పురాతన ఆలయాన్ని కూల్చివేసినట్లు వస్తున్న వార్తలపై జిల్లా యంత్రాంగం స్పష్టత ఇచ్చింది. మే 6వ తేదీన కొన్ని మీడియా సంస్థల్లో వచ్చిన కథనాలు తప్పుదారి పట్టించేవిగా ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. వాస్తవ పరిస్థితులను సమీక్షించేందుకు రెవెన్యూ, పురావస్తు శాఖ , ూఉఇచిఎఆఅ, సంబంధిత కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమగ్ర విచారణ చేపట్టారు.యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ నిర్మాణానికి కేటాయించిన 30 ఎకరాల ప్రభుత్వ భూమిని శుభ్రం చేస్తుండగా, దట్టమైన పొదల్లో శిథిలావస్థలో ఉన్న కొన్ని నిర్మాణ అవశేషాలు బయటపడ్డాయి. అయితే, ఆ నిర్మాణాలను కూల్చివేసినట్లుగానీ, ఉద్దేశపూర్వకంగా ధ్వంసం చేసినట్లుగానీ ఎలాంటి ఆధారాలు లేవని అధికారులు నిర్ధారించారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం అది ప్రభుత్వ భూమి మాత్రమేనని, దేవాదాయ శాఖకు సంబంధించింది కాదని స్పష్టం చేశారు.పురావస్తు శాఖ అధికారులు ఈ కట్టడాన్ని పరిశీలించి, ఇది రక్షిత దేవాలయం కాదని మరియు పురావస్తు కట్టడాల జాబితాలో నమోదు కాలేదని తేల్చారు. కలెక్టర్ మరియు నర్సంపేట ఎమ్మెల్యే సైతం ఘటనా స్థలాన్ని సందర్శించి, ఆ నిర్మాణానికి పురావస్తు శాఖ గుర్తింపు వచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. చరిత్రకారుల సలహాలతో ఆ నిర్మాణాన్ని అదే ప్రదేశంలో పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. ఏదైనా సమాచారాన్ని ప్రచురించే ముందు అధికారికంగా ధ్రువీకరించుకోవాలని మీడియాకు, ప్రభుత్వ సమాచారాన్ని మాత్రమే నమ్మాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.సమీకృత పాఠశాల నిర్మాణం కోసం 800 ఏళ్ల పురాతన శివాలయం కూల్చివేసిన రేవంత్ ప్రభుత్వం అని సోషల్ మీడియాలో వైరల్ అయింది.

వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలం అశోక్ నగర్ ప్రాంతంలో 800 ఏళ్ల క్రితం కాకతీయ రాజు గణపతి దేవుడి కాలంలో నిర్మించిన శివాలయం కూల్చివేశారని తెలుగు స్క్రైబ్ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. రాష్ట్ర పురావస్తు శాఖ పరిధిలో ఉన్న శివాలయాన్ని సమీకృత పాఠశాల నిర్మాణం కోసం బుల్డోజర్‌తో కూల్చడం అన్యాయం అని సోషల్ మీడియాలో పోస్టులు వైరల్ అయ్యాయి. ఇది తెలంగాణ చరిత్రకు మచ్చ అని తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు ప్రచారం జరిగింది. వరంగల్ జిల్లాలో ఎనిమిది వందల సంవత్సరాల క్రితం నాటి ప్రాచీన కాకతీయ శివాలయం ధ్వంసంపై కేంద్రం సీరియస్ అయిందని, దాంతో సాంస్కృతిక మంత్రిత్వ శాఖ పురావస్తు విభాగం కేసు నమోదు చేసినట్లు సమాచారం. తెలంగాణకు చెందిన ప్రముఖ హ్యూమన్ రైట్స్ న్యాయవాది ఇమ్మనేని రామారావు ఫిర్యాదుతో నేషనల్ మాన్యుమెంట్స్ అథారిటీ స్పందించిందని, 1965లోనే ఈ ఆలయ శాసనాలను హెరిటేజ్ శాఖ నమోదు చేశారని.. తెలంగాణ హెరిటేజ్ చట్టం సెక్షన్ 30 కింద బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్లు వస్తున్నాయి.

# ఫీజు రీ ఎంబర్స్ మెంట్‌పై కీలక నిర్ణయం

**హైదరాబాద్** తెలంగాణ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల దరఖాస్తు ప్రక్రియలో కీలకమైన సంస్కరణలు చేపట్టింది. ఇకపై ట్యూషన్ ఫీజుల కోసం దరఖాస్తు చేసుకోవాలంటే విద్యార్థుల పదో తరగతి మెమోలోని పేరు, ఇంటిపేరు.. వారి ఆధార్ కార్డులోని వివరాలతో కచ్చితంగా సరిపోలాల్సి ఉంటుంది. ఈ రెండింటిలో ఏమాత్రం తేడా ఉన్నా దరఖాస్తు ప్రక్రియ ముందుకు సాగదు. జాతీయ ఉపకార వేతనాల విధానానికి అనుగుణంగా ప్రభుత్వం ఈ కొత్త పద్ధతిని అమలులోకి తెచ్చింది.దరఖాస్తు సమయంలో విద్యార్థులు తమ పదో తరగతి హాల్‌టికెట్ నంబర్, పుట్టినతేదీ, ఉత్తీర్ణులైన సంవత్సరం వంటి వివరాలు నమోదు చేయాలి. ఆ తర్వాత ఆధార్‌లోని పేరు, పదో తరగతి మెమోలోని పేరు సరిపోలితేనే దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమవుతుంది. మొదటి దశ పూర్తయ్యాక విద్యార్థికి ఒక ఐడీ వస్తుంది. అనంతరం మీ-సేవ కేంద్రాల్లో ఆధార్ బయోమెట్రిక్ ప్రాసెస్ పూర్తి చేసి, ఆన్‌లైన్‌లో మిగతా వివరాలు సమర్పించాల్సి ఉంటుంది. రెన్యువల్ విద్యార్థులకు కూడా ఇదే నిబంధన వర్తిస్తుంది.ఈ సంస్కరణలో భాగంగా ప్రభుత్వం మరో ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు ఎస్సీ విద్యార్థులకు అందిస్తున్నట్లుగానే, ఇకపై ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగ విద్యార్థులకు కూడా ట్యూషన్ ఫీజులు, స్కాలర్‌షిప్‌లను నేరుగా వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లోనే జమ చేయనుంది. ప్రతి ఏటా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 12 లక్షల మంది విద్యార్థులు ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకుంటుండగా, ప్రభుత్వం సుమారు రూ.2400 కోట్లు ఖర్చు చేస్తోంది.అధికారిక అంచనాల ప్రకారం సుమారు 20 శాతం మంది విద్యార్థులు తమ ఆధార్ వివరాలను సవరించుకోవాల్సి ఉంటుందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో 2026-27 విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోగా విద్యార్థులు తమ ఆధార్ కార్డులో పేరు, ఇంటిపేరులో ఉన్న తప్పులను ఈ వేసవి సెలవుల్లోనే సరిచేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. దీంతో పాటు తమ మొబైల్ నంబర్‌ను ఆధార్‌తో, ఆధార్‌ను బ్యాంకు ఖాతాతో తప్పనిసరిగా అనుసంధానం చేసుకోవాలి. అన్ని వివరాలను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే ప్రభుత్వం ఫీజులను మంజూరు చేస్తుంది.

# మొక్కజొన్న రైతుల కష్టాలు ఇంతింతకాదయా..

**మహబూబ్ నగర్,** రోజుల తరబడి ధాన్యం విక్రయానికి రైతులు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఆరుగాలం కష్టించి పండించి న మొక్కజొన్న పంటను అమ్ముకునేందుకు రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నాగర్ కర్నూల్ జిల్లాలో ఎన్నడూ లేని విధంగా ఈసారి మొక్కజొన్న సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగినప్పటికీ, అందుకు అనుగుణంగా అధికారులు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.మార్క్ఫెడ్ ద్వారా పీఏసీఎస్ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోళ్లు ప్రారంభించినప్పటికీ గన్ని సంచుల కొరత, కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిల్వ చేసేందుకు సరిపడ గోదాములు లేకపోవడంతో కొనుగోలు ప్రక్రియ లో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ. 2400 రైతులకు పూర్తిస్థాయిలో అందడం లేదు.హమాలీ, రవాణా ఖర్చులు అధికంగా ఉండటంతో పాటు సకాలంలో దిగుమతులు జరగక రైతులు మరింత ఇబ్బందులు పడుతున్నారు.దీంతో అనేక మంది రైతులు ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరలకు మొక్కజొన్న విక్రయిస్తున్నారు. మరికొందరు రూ.25 నుంచి రూ.30 వరకు చెల్లించి బయట గన్ని బ్యాగులను కొనుగోలు చేస్తున్నారు , ధాన్యం నింపినచోట అమాలికి బస్తాకు రూ 25లు, దిగుమతి వద్ద కూడా ఒక్కో బస్తాకు అదనంగా రూ.5 వసూలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఒక క్వింటాల్కు సుమారు రూ.200 నుంచి రూ.300 వరకు అదనపు భారం పడుతోందని తెలిపారు.మండలానికి ఒకే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడంతో రైతులు అధికారులు సూచించిన గోదాములకు ధాన్యం తరలించాల్సి వస్తోంది.అక్కడ దిగుమతికి నాలుగు నుంచి ఐదు రోజుల సమయం పడుతుండటంతో రవాణా ఖర్చులు మూడింతలు అవుతున్నాయని రైతులు వాపోతున్నారు. రాత్రింబవళ్లు రోడ్లపైనే గడుపుతున్నప్పటికీ, గోదాముల్లో స్థలం లేదంటూ ఒకచోటు నుంచి మరొకచోటుకు పంపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్కడికి వెళ్లాక మళ్లీ వరుసలో నిలబడాల్సి రావడంతో మరింత సమయం వృథా అవుతోంది. ఒక ట్రాక్టర్ ధాన్యం దిగుమతికి సుమారు వారం రోజుల సమయం పడుతోందని రైతులు చెబుతున్నారు.దీంతో అద్దె ట్రాక్టర్లపై ధాన్యం తీసుకువచ్చిన రైతులు కిరాయిలు చెల్లించలేక సతమతమవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులకు సమీపంలోని గోదాములకే ధాన్యం తరలించేలా చర్యలు తీసుకోవాలని, గన్ని సంచులు సకాలంలో అందించి రైతులపై పడుతున్న అదనపు ఆర్థిక భారాన్ని తగ్గించాలని కోరుతున్నారు.

# జాతీయ గీతానికి రక్షణ ఉందని తెలుసా

**హైదరాబాద్,** వందేమాతరం 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేంద్రం పూర్తి గేయం పాడాలని ఇటీవల చట్టం చేసింది. తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. వందేమాతరాన్ని జాతీయ గీతంతో సమానంగా గౌరవించాలని ఆదేశాలు జారీ చేసింది. ఉద్దేశపూర్వక అవమానం, ఆటంకం, లేదా అడ్డంకి కలిగించే వారిని జైలుకు పంపాలని పేర్కొంది.ఇప్పటి వరకు 1971 నాటి చట్టం ప్రధానంగా జనగణమన, జాతీయ జెండా, రాజ్యాంగ గౌరవానికే రక్షణ కల్పిస్తోంది. కొత్త ప్రతిపాదన ద్వారా వందేమాతరానికీ అదే న్యాయస్థాయి వర్తింపజేయాలని కేంద్రం భావిస్తోంది. ఇది చట్టపరంగా జాతీయ గీతం, జాతీయ గేయం" మధ్య ఉన్న రక్షణ తేడాను తొలగించింది.వందేమాతరాన్ని అవమానించే లేదా పాడటాన్ని అడ్డుకునే వారికి గరిష్ఠంగా మూడేళ్ల జైలు, జరిమానా, లేదా రెండూ విధించే అవకాశం ఉంటుంది. ఈమేరకు కేంద్రం చట్టపరమైన రక్షణ కల్పించింది. ఇది ప్రతి సందర్భానికీ తక్షణ శిక్ష అన్న అర్థం కాదు. ఉద్దేశం, పరిస్థితి, చర్య తీవ్రత వంటి అంశాలను కోర్టు పరిశీలించే అవకాశం ఉంటుంది. అందువల్ల ఇది భావోద్వేగ ప్రతిస్పందన కంటే న్యాయపరమైన ప్రక్రియకు లోబడి పనిచేసే చట్టమే.ఈ నిర్ణయానికి సాంస్కృతిక కోణం ఎంత ఉందో, రాజకీయ సంకేతమూ అంతే ఉంది. వందేమాతరానికి ఉన్న చారిత్రక గుర్తింపును మరింత బలపరచడం ద్వారా, జాతీయతా భావనను కేంద్రం ముందుకు తెస్తోంది. అదే సమయంలో, ఈ అంశం దేశవ్యాప్తంగా భావోద్వేగ స్పందనలను రేకెత్తించే అవకాశం కూడా ఉంది.ఇలాంటి చట్టం దేశభక్తి చిహ్నాలపై గౌరవాన్ని పెంచుతుందని మద్దతుదారులు వాదించవచ్చు. కానీ మరోవైపు, గౌరవం చట్టబద్ధ శిక్షలతో ఎంతవరకు నిలుస్తుందన్న ప్రశ్న కూడా సహజమే. గీతాన్ని లేదా గేయాన్ని గౌరవించడం సామాజిక నైతికత నుంచి రావాలి. చట్టం దానికి తోడ్పడగలదు కానీ పూర్తి ప్రత్యామ్నాయం కాకపోవచ్చు.మొత్తంగా చూస్తే, వందేమాతరానికి రక్షణ కల్పించాలన్న కేంద్ర నిర్ణయం ఒక సాంస్కృతిక?చట్టపరమైన ప్రకటన. దేశ గౌరవ చిహ్నాల పట్ల నియమబద్ధమైన గౌరవం ఉండాలన్న సందేశం ఇందులో ఉంది. అయితే ఈ సవరణ ఎంత దూరం అమలవుతుందో, పార్లమెంటులో ఆమోదం తర్వాత దాని పరిధి ఎలా రూపుదిద్దుకుంటుందో చూడాలి.

# హుందాగా వ్యవహరిస్తున్న స్టాలిన్

**చెన్నై,** రాజకీయ నాయకుల పరిస్థితి ఎలా ఉందంటే.. అధికారాన్ని దక్కించుకుంటేనేమో వారు గొప్ప నాయకులు. ఒకవేళ అధికారాన్ని కోల్పోతే మాత్రం ఈవీఎం లో అవకతవకలు.. గెలిచిన వారేమో తమను తాము గొప్పగా చెప్పుకుంటుంటే.. ఓడిపోయిన వారు తమ తప్పులను కాకుండా.. అదంతా ఈవీఎం ల మాయ అనే విమర్శలు చేస్తున్నారు. ఈవీఎంల ద్వారా గెలిచి.. ప్రజాస్వామ్యాన్ని నాశనం చేశారని ఆరోపిస్తున్నారు. వారు గెలిసినప్పుడు మాత్రం ఈ మాట మాట్లాడటం లేదు.ఆ మధ్య ఏపీలో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు జరిగాయి. వైసిపి దారుణంగా ఓడిపోయింది. 11 స్థానాలకు మాత్రమే పరిమితం అయిపోయింది. అయితే ప్రజల్లో ఉన్న ఆగ్రహాన్ని అంచనా వేయలేక వైసీపీ దారుణమైన ఓటమిని మూటకటుకుంది. ఈ విషయాన్ని చెప్పలేక వైసీపీ నాయకులు తామ ఓడిపోయిన నెపాన్ని ఈ వియంల నెట్టడం మొదలుపెట్టారు. అంతేకాదు ఓట్ల నమోదుకు.. చివరి క్షణంలో ఎన్నికల సంఘం ఇచ్చిన లెక్కకు పోలిక సరిపోడం లేదని సరికొత్త ఆరోపణ తెరపైకి తీసుకొచ్చారు. వాస్తవానికి ఈవీఎం యంత్రాలను ఎవరూ హ్యాక్ చేయలేరు అనే విషయం అందరికీ తెలుసు కానీ ప్రజల్లో సానుభూతి పొందడానికి ఈ తరహా ప్రచారానికి వైసిపి శ్రీకారం చుట్టడం విశేషం.వైసిపి మాదిరిగానే పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమత బెనర్జీ కూడా ఈ తరహా ప్రచారాన్ని మొదలుపెట్టారు. ఎన్నికల్లో బిజెపి లూటీ చేసి గెలిచిందని ఆరోపించడం ప్రారంభించారు.. కేరళలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో కూటమి గెలిస్తే దాని గురించి మాట్లాడటం లేదు. అస్సాం, పశ్చిమబెంగాల్ లో బిజెపి గెలిస్తే మాత్రం మమత బెనర్జీ ఈ తరహా వ్యాఖ్యలు చేస్తున్నారు. చివకి తమిళనాడులో ఏ పార్టీకి కూడా సరైన మెజారిటీ రాకపోయిన విషయాన్ని కూడా ఆమె గుర్తించడం లేదు. చివరికి తమిళనాడులో బిజెపి ఒకే ఒక ఎమ్మెల్యే స్థానంతో సరిపెట్టుకున్నప్పటికీ ఆమెకు అది కనిపించడం లేదు. పైగా రాహుల్ గాంధీ లాంటి నాయకులు మమతను సపోర్ట్ చేస్తున్నారు. అఖిలేష్ యాదవ్ లాంటి మాజీ ముఖ్యమంత్రి మమతకు జై కొడుతున్నారు. అసలు ఇటువంటి నాయకులను ఏమనాలో అర్థం కావడం లేదు.మరోవైపు ఇండియా కూటమిలోనే ఉన్న డీఎంకే మాత్రం తమిళనాడు ఎన్నికల విషయంలో సరికొత్తగా స్పందించింది.. ముఖ్యంగా డీఎంకే అధినేత స్టాలిన్ హుందాగా మాట్లాడారు.. ఆయన మాట్లాడిన మాటలు చాలామంది నాయకులకు గడ్డి పెట్టే విధంగా ఉన్నాయి.. "నేను గెలిచింది ఈవీఎంల మీదనే.. ఓడిపోయింది కూడా ఈవీఎంల మీదనే.. గెలిచాక నా సత్తా వల్లా అని.. ఓడిపోయిన తర్వాత ఈవీఎంలు హ్యాక్ అయ్యాయని అదంతా దద్దమ్మని కాదు. ప్రజల తీర్పు గౌరవించడం రానివాళ్లే అలా మాట్లాడతారు" అని స్టాలిన్ వ్యాఖ్యానించారు. స్టాలిన్ మాట్లాడిన మాటలు ప్రస్తుతం సోషల్ మీడియాలో సంచలనం కలిగిస్తున్నాయి. ఈ వ్యాఖ్యలను టిడిపి నేతలు ప్రముఖంగా ప్రస్తావిస్తున్నారు. ఈవీఎంల మీద మాట్లాడే నాయకులకు స్టాలిన్ గడ్డపార స్థాయిలో రాడ్డు దింపారని వ్యాఖ్యానిస్తున్నారు.

# గ్రేటర్ లో పాగా లక్ష్యంగా ఆపరేషన్ ఆకర్ష్..

**హైదరాబాద్,** బెంగాల్‌పై ఫోకస్ చేసి మరీ కొట్టారు. నెక్స్ట్ మిషన్ సౌత్ లో భాగంగా..తెలంగాణపై బీజేపీ కాన్సంట్రేట్ చేసింది. నైజాంలోనూ కాషాయ జెండా ఎగరవేసేందుకు వ్యూహాలు రచిస్తోంది. ఈ క్రమంలోనే ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల తర్వత?నరేంద్ర మోదీ తొలి సభ తెలంగాణలోనే జరుగనుంది. ఈ సభా వేదికగా.. బీజేపీ ఆపరేషన్ ఆకర్ష్‌కు తెరలేపనుందా? ఇంతకు కమలనాథులతో టచ్‌లో ఉన్న బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలెవరు? మోదీ సభలో చేరికలు ఉండబోతున్నాయనే టాక్ నిజమేనా.. మైండ్ గేమా?తెలంగాణా వార్తలుఆఫ్టర్ ఎ లాంగ్ టైమ్..ప్రధాని మోదీ ఈ నెల 10న తెలంగాణకు వస్తున్నారు. ఇప్పటికే ప్రధాని షెడ్యూల్ టూర్ ఖరారైంది. ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. సాయంత్రం 7 గంటల వరకు హైదరాబాద్‌లో టైమ్ స్పెండ్ చేయనున్నారు ప్రధాని. ఇందులో భాగంగా అధికార, పార్టీ కార్యక్రమాలు కూడా ఫిక్స్ చేశారు. పార్టీ కార్యక్రమాల వేదికగా బీజేపీని బలోపేతం చేసేందుకు సిద్ధం అవుతున్నారు. టార్గెట్ తెలంగాణ లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. తెలంగాణలో అధికారంలోకి రావాలంటే సాధారణ ఎన్నికల ముందు జరిగే గ్రేటర్ ఎన్నికలను సెమీ ఫైనల్‌గా భావిస్తున్నాయి అన్ని పార్టీలు. గ్రేటర్ పరిధిలోని మూడు కార్పొరేషన్లలో పాగా వేయడమే లక్ష్యంగా బీజేపీ పావులు కదుపుతోంది. ఇందుకోసం బీఆర్ఎస్ , కాంగ్రెస్ నేతలను పార్టీలో చేర్చుకునేందుకు వ్యూహాలు రచిస్తున్నారట.ఇటీవల మాజీ మంత్రి మల్లారెడ్డి కోడలు బీజేపీ స్టేట్ ఆఫీస్‌కు రావడం పొలిటికల్ సర్కిల్స్‌లో పెద్ద ఎత్తున చర్చ జరిగింది. మాజీ మంత్రి మల్లారెడ్డి కుటుంబంతో కలిసి ఢిల్లీలో నరేంద్ర మోదీని కలిశారు. దీంతో బీఆర్ఎస్‌లో ఒక్కసారిగా కలకలం రేగింది. మాజీ మంత్రి మల్లారెడ్డి కుటుంబంతో సహా కమలం గూటికి చేరేందుకు రెడీ అయ్యారన్న వార్తలు వస్తున్నాయి. అయితే బీజేపీలో చేరికపై మల్లారెడ్డి కోడలు ప్రీతిరెడ్డి క్లారిటీ ఇచ్చినా..వారి కుటుంబం వేస్తున్న అడుగులు బీజేపీలో చేరేలా ఉన్నాయనే చర్చ నడుస్తోంది. ఇప్పుడు ఇదే అంశం బీఆర్ఎస్‌లోనూ చర్చకు దారి తీసిందంటున్నారు. నరేంద్ర మోదీ రాష్ట్రానికి వస్తున్న నేపథ్యంలో మాజీమంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి, అల్లుడు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, మల్లారెడ్డి కొడుకు భద్రారెడ్డి, కోడలు ప్రీతిరెడ్డి బీజేపీలో చేరబోతున్నారా అనే ఊహాగానాలు మొదలయ్యాయి. బీజేపీ నేతలు కూడా ఈ అంశంపై నర్మగర్భంగా స్పందిస్తుండటం చర్చనీయాంశంగా మారింది.ఇక గ్రేటర్‌లో కీలకంగా ఉన్న కాంగ్రెస్ నేతలే లక్ష్యంగా ఆపరేషన్ ఆకర్ష్‌కు తెర లేపేందుకు సిద్ధమయ్యారట కమలనాథులు. గ్రేటర్ పరిధిలో ఉన్న ఒక్కరిద్దరు కాంగ్రెస్ సీనియర్ నేతలను చేర్చుకునేలా పావులు కదుపుతున్నారట. జీహెచ్ఎంసీ, మల్కాజ్ గిరి కార్పొరేషన్, సైబరాబాద్ కార్పొరేషన్ పరిధిలో పాగా వేసేలా బలమైన నేతలను తమ వైపునకు తిప్పుకునేందుకు వ్యూహాలు రచిస్తున్నారట. నరేంద్ర మోదీ సభ వేదికగా బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలను బీజేపీలోకి తీసుకోవడం ద్వారా ఆ రెండు పార్టీలకు షాక్ ఇవ్వాలనే ప్లాన్ నడుస్తోందట.వార్తా సేవలుమోదీ సభను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న స్టేట్ బీజేపీ లీడర్లు..ఇక మోదీ సభకు ముందు, ఆ తర్వాత అన్నట్టుగా పార్టీ దూకుడు పెంచాలని డిసైడ్ అయ్యారట. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లో ఉన్న బలమైన నేతలను, ఆయా పార్టీలో ఉన్న అసంతృప్త నేతలను ఐడెంటిఫై చేసి వారిని దశల వారీగా కమలం గూటికి చేర్చుకోవాలనేది ప్లాన్ అంటున్నారు. మరి మోదీ సభ వేదికగా బీజేపీలో చేరేదెవరో చూడాలి.

# మోదీ సభ తర్వాత

## తెలంగాణ రాజకీయాలు మారబోతున్నాయి

**హైదరాబాద్** ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ నెల 10వ తేదీన తెలంగాణలో పర్యటిస్తున్నారని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు నారపరాజు రామచందర్‌రావు వ్యాఖ్యానించారు.ఈ సభ తర్వాత తెలంగాణ రాజకీయాలు మారబోతున్నాయని పేర్కొన్నారు. ఈ సభ ఏర్పాట్లు అన్ని దాదాపు పూర్తి అయ్యాయని చెప్పుకొచ్చారు. పరేడ్ గ్రౌండ్‌లో మోదీ హాజరయ్యే సభ ఏర్పాట్లను శుక్రవారం రామచందర్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.తెలంగాణ అభివృద్ధిలో మోదీ ప్రాధాన్యం..ఈరోజు నుంచి రెండు రోజులపాటు పరేడ్ గ్రౌండ్ పరిసర ప్రాంతాలు అన్ని కేంద్ర బలగాల అధీనంలోకి వెళ్తాయని వెల్లడించారు. గ్రేటర్ ఎన్నికల ముందు మోదీ సభ జరగడం తమ పార్టీకి కలిసి వచ్చే అంశమని తెలిపారు. తెలంగాణ అభివృద్ధిలో మోదీ ప్రాధాన్యం చాలా ఉందని ఉద్ఘాటించారు. రెండు లక్షలకు పైగా మందితో ఈ సభ సక్సెస్ కాబోతుందని అన్నారు. బీజేపీ శ్రేణులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా మోదీ సభ కోసం తరలి వస్తున్నారని తెలిపారు.

## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశమును ప్రారంభించిన. శ్రీధర్ బాబు సహకారంతో సర్పంచ్ గుడిసె గట్టయ్య యాదవ్



**మంథని ( ప్రశ్న న్యూస్)** మండలం లోని కన్నాల గ్రామానికి చెందిన పెండెం శారదా-సత్యనారాయణ దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం చేయడం జరిగింది ప్రజా ప్రభుత్వంలో పేద ప్రజల సొంతింటి కల నెరవేరుతున్న శుభ తరుణం ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ చైర్మన్గా హామీ మేరకు రాష్ట్రంలోని పేద ప్రజలందరికీ సొంత ఇంటి కల నెర వేర్చే హామీ మేరకు పేద ప్రజలకు ఇందిరమ్మ ఇల్లు ద్వారా వారి సొంత ఇంటి కల నెరవేరుతుంది ఈ సందర్భంగా కన్నాల సర్పంచ్ గుడిసె గట్టయ్య యాదవ్ మాట్లాడుతూ మేనిఫెస్టో చైర్మన్గా శ్రీధర్ బాబు ఆరు హా హామీలలో భాగంగా పేద ప్రజలందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందని కన్నాల గ్రామా నికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మహేందర్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ ముస్కుల ప్రశాంత్ రెడ్డి, జిల్లా కిసాన్ సెల్ చైర్మన్ సురేందర్ రెడ్డి, కన్నాల ఉపసర్పంచ్ గాదే దివ్య సంజీవరెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తోకల మల్లేష్ కావటి సందీప్ కావటి సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## విలాసాగర్ ఉపసర్పంచ్ కుటుంబానికి ప్రసన్న హరికృష్ణ పరామర్శ - ప్రగాఢ సంతాపం



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, విలాసాగర్ గ్రామ ఉపసర్పంచ్ పొత్తూరి శైలజ-రాజు కుటుంబంలో ఇటీవల చోటుచేసుకున్న మరణవార్త నేపథ్యంలో, పట్టభద్రుల ఎమ్మెల్సీ కంటెస్టెడ్ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ శుక్రవారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.మృతురాలి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన ఆయన, ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని ఓదార్పునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ రెండో వార్డు సభ్యులు దమ్మ వెంకట రమణ,వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కల్లెపల్లి సతీష్, కాంగ్రెస్ నాయకులు ఏనుగుల ప్రశాంత్ కుమార్, రాజ్యాధికార పార్టీ బోయినిపల్లి మండల శాఖ అధ్యక్షుడు కొంకటి శ్రీధర్, సుంకపాక వంశీకృష్ణ, దుమాల వెంకటేష్ తదితరులు,ప్రసన్న హరికృష్ణ అభిమానులు పాల్గొన్నారు.

## మోదీ సభను విజయవంతం చేద్దాం

**- వేములవాడ నుంచి భారీగా తరలిరావాలి : భాజపా నాయకులు**

**- మోదీ సభ - హిందూ ఏక్తా యాత్రపై బీజేపీ పట్టణ శాఖ కార్యాచరణ**



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని భీమేశ్వర గార్డెన్లో శుక్రవారం నిర్వహించిన బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పార్టీ నాయకులు ప్రధాని నరేంద్ర మోదీ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా పట్టణ బీజేపీ అధ్యక్షులు రాపెల్లి శ్రీధర్ మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ మూడోసారి బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా తెలంగాణ రాష్ట్రానికి విచ్చేస్తున్న నేపథ్యంలో వేములవాడ నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు, నాయకులు, ప్రజలు తరలిరావాలని కోరారు.అనంతరం ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ మూడోసారి బాధ్యతలు స్వీకరించిన అనంతరం హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్లో జరిగే సభకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే ఈ నెల 12న కరీంనగర్లో నిర్వహించే హిందూ ఏక్తా యాత్రకు కూడా భారీగా పాల్గొనాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మార్త సత్తయ్య, రేగుల మల్లికార్జున్, కౌన్సిలర్ మైల శ్రీనివాస్, మహంకాళి శీను, వివేక్ రెడ్డి, నామాల శేఖర్, మల్లేశం యాదవ్, బోనాల శివతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గోదావరిఖని మ్యారేజ్‌లో పాల్గొన్న ఎంపీ గడ్డం వంశీకృష్ణ

**- మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి.**



**మంథని ( ప్రశ్న న్యూస్)** పెద్దపల్లి జిల్లాలోని గోదావరిఖనిలో ఎంపీ గడ్డం వంశీకృష్ణ , మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి పర్యటించారు.స్థానిక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాచకొండ శ్యామల -- కోటేశ్వర్ దంపతుల కుమార్తె వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులు అక్షయ -- శశిధర్లను ఆశీర్వదించారు.ఈ సందర్భంగా ఎంపీ వంశీకృష్ణ కి, మంత్రి వివేక్ కి స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ జాతీయ నాయకులు బాబర్ సలీం పాషా, గుమ్మడి కుమారస్వామి మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఇష్టానుసారంగా ఫ్లెక్సీలు

**- ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరు**
**- అనుమతులు లేకున్నా ఫ్లెక్సీలు పెట్టవచ్చా**
**- జిహెచ్ఎంసి అధికారులు ఫెక్సీ లు పెట్టిన నాయకులకు ఎంత ఫైన్ వేశారు**




**ఉప్పల్ (ప్రశ్న న్యూస్)** ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారని జిహెచ్ఎంసి అనుమతి లేకుండా ఫ్లెక్సీలు పెట్టిన వారికి అధికారులు ఎంత ఫైన్ వేస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.మే 10 నరేంద్ర మోడీ హైదరాబాద్ పర్యటనకు వస్తున్న సందర్భంగా ఉప్పల్ సర్కిల్లో బిజెపి నాయకులు జిహెచ్ఎంసి అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి కరెంటు స్తంభాలకు, రోడ్లపై ఎక్కడపడితే అక్కడ ఇష్టానుసారంగా ఫ్లెక్సీలు పెట్టారు. గ్రేటర్ మున్సిపాలిటీ ఎన్నికలు ఉండడంతో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు పోటీపడి ఫ్లెక్సీలను



ఏర్పాటు చేశారని జరగరాని సంఘటన జరిగితే అధికారులు బాధ్యత తీసుకుంటారా.? లేక ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన వారిపై కేసులు పెడతారా.? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. జిహెచ్ఎంసి అనుమతి లేకుండా ఇష్టానుసారంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన వాటిని జిహెచ్ఎంసి అధికారులు తొలగించకపోవడం విడ్డూరంగా ఉందని, సామాన్య మధ్యతరగతి ప్రజలు పుట్టినరోజుకు కొన్ని కార్యక్రమాలకు రోడ్లపై ఫెక్సీలు పెడితే వెంటనే వాటిని తొలగిస్తారని రాజకీయ నాయకుల ఫ్లెక్సీలను జిహెచ్ఎంసి అధికారులు ఎందుకు తొలగించాలని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.ఫ్లెక్సీలు బ్యానర్లు ఏర్పాటు చేసిన వారికి నోటీసులు ఇచ్చి ఫైన్లు వేస్తారా.? వీరిపై జిహెచ్ఎంసి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారు వేచి చూడాలి.

## చిత్తూరు ప్రభుత్వాసుపత్రిలో ఫైర్ అలర్ట్

**- అప్రమత్తతే ప్రాణ రక్షణ కవచం: జిల్లా ఫైర్ ఆఫీసర్ పెద్దిరెడ్డి**



**చిత్తూరు,** అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించే లక్ష్యంతో చిత్తూరు జిల్లా ప్రధాన ప్రభుత్వాసుపత్రిలో శుక్రవారం "ఫైర్ అవేర్‌నెస్ వీక్" కార్యక్రమం నిర్వహించారు. అపోలో ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలి, రోగులను సురక్షిత ప్రాంతాలకు ఎలా తరలించాలి, అగ్నిమాపక పరికరాలను ఎలా వినియోగించాలి వంటి అంశాలపై సిబ్బందితో మాక్ ఫైర్ డ్రిల్ నిర్వహించారు.ఫైర్ అవేర్‌నెస్ వీక్‌లో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఫైర్ ఆఫీసర్ సి.పెద్దిరెడ్డి మాట్లాడుతూ అగ్నిప్రమాదాల నివారణలో ముందస్తు జాగ్రత్తలే కీలకమన్నారు. ప్రతి సంస్థలో ఫైర్ సేఫ్టీ పరికరాలు అందుబాటులో ఉండటంతో పాటు వాటి వినియోగంపై సిబ్బందికి తరచూ శిక్షణ ఇవ్వాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో అప్రమత్తంగా స్పందిస్తే ప్రాణనష్టం, ఆస్తి నష్టాన్ని తగ్గించవచ్చన్నారు.ఆసుపత్రి ప్రాంగణంలో నిర్వహించిన మాక్‌డ్రిల్‌లో అగ్నిప్రమాదం సంభవించినట్లుగా ఊహించి రోగులను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, అగ్నిమాపక పరికరాల వినియోగం, అత్యవసర అలారమ్ వ్యవస్థల పనితీరు వంటి అంశాలను ప్రత్యక్షంగా ప్రదర్శించారు. అగ్నిప్రమాదం సంభవించిన వెంటనే ఎలాంటి సమాచారం అందించాలి, సిబ్బంది ఎలా సమన్వయంతో పనిచేయాలి, రోగులు, సహాయకులను ఎలా బయటకు తరలించాలి వంటి అంశాలపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.విద్యుత్ షార్ట్‌సర్క్యూట్లు, గ్యాస్ లీకేజీలు, నిర్లక్ష్యంగా వదిలే ఎలక్ట్రానిక్ పరికరాల వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అధికారులు తెలిపారు. ముఖ్యంగా ఆసుపత్రులు వంటి ప్రజా రద్దీ ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో ఫైర్ సేఫ్టీ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అగ్నిప్రమాదాల సమయంలో భయాందోళనలకు గురికాకుండా సమయస్ఫూర్తితో స్పందిస్తే ప్రాణనష్టం, ఆస్తి నష్టాన్ని గణనీయంగా తగ్గించవచ్చని సూచించారు.

కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వి.ఉషశ్రీ, అపోలో నాలెడ్జ్ సిటీ యూనిట్ హెడ్ ఎస్.బాలరాజ్, అపోలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రంగనాథ్ బి.జి., డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి డాక్టర్ అనీల్‌కుమార్, ఎల్.శ్రీవాణి, ఎఐఎంఎస్ఆర్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ బాలసుబ్రమణ్యం, సెక్యూరిటీ ఆఫీసర్ పార్థసారథి, ఫైర్ సూపర్వైజర్ జహంగీర్ తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ, అపోలో నర్సింగ్ సిబ్బంది, మెడికల్ విద్యార్థులు, హౌస్‌కీపింగ్, క్యాంటిన్, సెక్యూరిటీ సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## మలేరియా నివారణకు ఇంటింట మందుల స్ప్రేయింగ్

**- హెల్త్ అసిస్టెంట్ చట్టు చిన్న**



**అరకులోయ** అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండలం మాడగడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల శిరగం పంచాయితీ కోడిపుంజువలస హెల్త్ అసిస్టెంట్ చట్టు చిన్న గ్రామంలో ఇంటింటకి స్ప్రేయింగ్ ప్రగతి పనితీరు పరిశీలించారు మలేరియాజ్వరాల నివారణ కొరకు వైద్య ఉన్నత అధికారుల వైద్య అధికారి ఆదేశాల మేరకు మలేరియా ప్రభావిత ప్రాంతాల దోమల నివారణ కొరకు దోమల మందు స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని హెల్త్ అసిస్టెంట్ చట్టు చిన్న అన్నారు రక్తపూతల సేకరణ మలేరియా బాధితుల వివరాలు అడిగి తెలుసుకున్నారు గ్రామ ప్రజలు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని దోమలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెల్త్ అసిస్టెంట్ చట్టు చిన్న గ్రామ ప్రజలకు తెలిపారు.ఈ కార్యక్రమం లో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

## స్వీయ గణన నమోదులో

# భాగస్వామ్యులు కావాలి

**- ఈ నెల 10 వ తేదీతో ముగియనున్న స్వీయ గణన గడువు**
**- జిల్లా కలెక్టర్, ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ గరిమ అగ్రవాల్**



**రాజన్న సిరిసిల్ల** జన గణన 2027 లో భాగంగా స్వీయ గణన నమోదులో భాగస్వామ్యులు కావాలని, ఈ నెల 10 వ తేదీతో స్వీయ గణన నమోదు గడువు ముగియనుందని జిల్లా కలెక్టర్, ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ గరిమ అగ్రవాల్ కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం ప్రకటన జారీ చేశారు. స్వీయ గణన కోసం ష్టబిబిజూబ://బవ.ఇవనిబబీబ.ఐనీల.తిని వెబ్ సైట్ ద్వారా లాగిన్ కావాలని సూచించారు.ఈ మొత్తం ప్రక్రియకు కేవలం 5 నిమిషాల సమయం పడుతుందని, వెబ్ సైట్ పూర్తి స్థాయిలో సురక్షితమని స్పష్టం చేశారు. ప్రజల సమాచారం పూర్తిభద్రంగా ఉంటుందని వెల్లడించారు. 34 ప్రశ్నలకు సరైన సమాచారం నమోదు చేసి ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. అన్ని శాఖల అధికారులు, జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ- ప్రైవేట్ ఉద్యోగులు వారి మొబైల్ ఫోన్ల ద్వారా స్వీయ గణన చేసుకుని ప్రక్రియను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్, ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ గరిమ అగ్రవాల్ కోరారు.జనగణనకు సంబంధించి ఏమైనా సందేహాలు ఉంటే హెల్ప్ లైన్ నెంబర్ 1855 కు సంప్రదించాలని, ఈ నంబర్ 24లీ 7 అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

## నష్టాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు

**ముంబాయి** పశ్చిమాసియాలో ఇరాన్-అమెరికా ఉద్రిక్తతల ప్రభావంతో దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 516 పాయింట్లు కోల్పోయి 77,328 వద్ద ముగిసింది. అలాగే, నిఫ్టీ 150 పాయింట్లు పడిపోయి 24,176 వద్ద స్థిరపడింది. అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల సంకేతాలు మార్కెట్లపై ప్రభావం కనిపించింది. డాలర్తో పోలిస్తే రూపాయి మారకం విలువ ?94.47 వద్ద కొనసాగుతోంది.

## గాంధీ భవన్కు ఖమ్మం కాంగ్రెస్ పంచాయితీ

**హైదరాబాద్** ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పంచాయతీ హైదరాబాద్ గాంధీ భవన్ కు చేరింది. ఇటీవల ప్రకటించిన నామినేటెడ్ పోస్టుల భర్తీ ఖమ్మం కాంగ్రెస్లో చిచ్చు రేపింది. ఈ నేపథ్యంలో శు క్రవారం నాడు గాంధీ భవన్లో రేణుకా చౌదరి వర్గీయులు ఆందోళన దిగారు.

నామినేటెడ్ పోస్టులపై రేణుక చౌదరి అసహనం ప్రకటించినట్లు సమాచారం. నామినేటెడ్ పదవుల భర్తీలో అన్యాయం జరిగిందని మండిపడుతున్న రేణుక వర్గం , భట్టి వర్గానికే అన్ని పదవులు అంటూ ఆగ్రహంగా ఉవుంది. నిజమైన కాంగ్రెస్ వాదులు కాకుండా కొత్తవారికి పదవులు ఇస్తున్నారు అంటూ ఆ వర్గం ఆరోపించింది. చెప్పులు మోసిన వారికి పదవులు ఇస్తున్నారు అంటూ పీసీసీకి ఫిర్యాదులు పంపింది. ఓడిపోయిన వారికి కమ్మ కార్పొరేషన్ ఎలా ఇస్తారంటూ రేణుక వర్గం ప్రశ్నించింది.

## తెలంగాణలో బీసీ కులాల పేర్లు మార్పు

**- కొత్త పేర్లు ఇవే!**

**హైదరాబాద్** తెలంగాణలోని వెనుకబడిన తరగతుల బీసీ చిరకాల వాంఛను నెరవేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఒక కీలకమైన సామాజిక సంస్కరణకు శ్రీకారం చుట్టింది. సమాజంలో కించపరిచే విధంగా ఉన్న కొన్ని కులాల పేర్లను తొలగించి,వాటి స్థానంలో గౌరవప్రదమైన పేర్లను చేరుస్తూ రాష్ట్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. బీసీ కమిషన్ సమర్పించిన నివేదిక ఆధారంగా తీసుకున్న ఈ నిర్ణయం వల్ల ఆయా వర్గాల ఆత్మగౌరవం పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది.ఈ మార్పులు తక్షణమే రాష్ట్ర గెజిట్ ద్వారా అధికారిక రికార్డుల్లోకి రానున్నాయి.

**బీసీ గ్రూప్-ఏలో విప్లవాత్మక మార్పులు..** ప్రభుత్వం చేపట్టిన ఈ మార్పుల్లో బీసీ గ్రూప్-ఏ విభాగంలో అత్యధిక మార్పులు జరిగాయి. ముఖ్యంగా వినడానికి అసభ్యకరంగా ఉన్న పదాలను రికార్డుల నుంచి పూర్తిగా తొలగించారు.దొమ్మర:ఈ పేరును తొలగించి గడ వంశీయ'గా మార్చారు.పిచ్చకుంట్ల: ఇకపై ఈ కులస్తులను వంశ రాజ్ గా వ్యవహరిస్తారు.బుడబుక్కల: వీరికి 'శివ క్షత్రియ' అనే గౌరవప్రదమైన పదాన్ని జోడించారు. వీరభద్రియ: వీరి కోరిక మేరకు 'వీరముష్టి, నెట్టి కోటల' అనే పదాలను పర్యాయపదాలుగా చేర్చారు.వన్నార్:ఈ పదాన్ని తొలగించి, రజక-చాకలి వర్గాల కోసం 'ధోబీ'అనే పదాన్ని ఖరారు చేశారు.గ్రూప్-డిలో 'శూద్ర' పదం తొలగింపు..బీసీ గ్రూప్-డి విభాగంలో కూడా ప్రభుత్వం సామాజిక స్పృహతో పలు మార్పులు చేసింది. ఎప్పటి నుంచో వివాదాస్పదంగా ఉన్న 'శూద్ర కులం' అనే పదాన్ని అధికారిక రికార్డుల నుంచి పూర్తిగా తొలగించారు. ఆ స్థానంలో 'తమ్మలి బ్రాహ్మణేతర'గా పేరు మారుస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీనివల్ల ఆ వర్గానికి స్పష్టమైన సామాజిక గుర్తింపు లభిస్తుంది. అలాగే వరుస సంఖ్య 5లో ఉన్న మేర, చిప్పోలు, కులాలకు అదనంగా 'మేరు' అనే పదాన్ని చేర్చారు.విద్యార్థులు,ఉద్యోగార్థులకు మేలు:ఈ నిర్ణయం వల్ల భవిష్యత్తులో విద్యార్థులు, ఉద్యోగార్థులు తమ కుల ధ్రువీకరణ పత్రాల్లో గౌరవప్రదమైన పేర్లను పొందే అవకాశం కలుగుతుంది. సమాజంలో పిలిచేటప్పుడు కలిగే ఇబ్బందులను తొలగించి, ఆయా వర్గాల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపడమే ఈ సంస్కరణ ముఖ్య ఉద్దేశమని బీసీ కమిషన్ వెల్లడించింది. కులాల పేర్ల మార్పుపై హర్షం వ్యక్తం చేస్తున్న బీసీ సంఘాలు,ఇది తమ సామాజిక హోదాను పెంచుతుందని అభిప్రాయ పడుతున్నాయి.

## మండల కేంద్రంలో వడ్డే వీధిలో

# తిష్ట వేసిన సమస్యలు

**- కాలువలను సైతం శుభ్రపరచని అధికారులు.**
**- ఆరోగ్యంతో ఆస్పత్రులు చుట్టూ తిరుగుతున్న వీధి ప్రజలు.**



**మద్దికేర** మండల కేంద్రమైన మద్దికేరలోని వడ్డే వీధిలో అధికారులు సమస్యలను పరిష్కరించకపోవడంతో సమస్యలన్నీ తిష్ట వేసినట్లు మండల అధ్యక్షుడు శంకర్ బాబు,జిల్లా కార్యవర్గ సభ్యులు డాక్టర్ రామ్మోహన్,శ్రీనివాసులు లు తెలియజేశారు.ఈ సందర్భంగా శు క్రవారం రోజున వడ్డే వీధిలో పర్యటించి వీధిలో గల సమస్యలను గ్రామ ప్రజల ద్వారా అడిగి తెలుసుకున్నారు.వడ్డే వీధిలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (డిపిఈపి) వద్ద కాలువలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను, చెత్తను వారు పరిశీలించారు. కాలువలో నిలిచిపోయిన వ్యర్థాల వలన దోమలు పెరిగే ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని వారు తెలియజేశారు.చాలామంది వీధి ప్రజలు ఆసుపత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని ప్రజలు తెలియజేశారు. ప్రజల ఆరోగ్యం పై నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని వీధి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా అధికారుల స్పందించి కాలువలను శుభ్రపరిచి వీధి ప్రజల సమస్యలను పరిష్కరించాలని బిజెపి నాయకులు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎక్స్ ఆర్మీ ఉద్యోగి గోపాల్,వీరుపాపురం సురేష్,బండి రాముడు,కైలాస్,ఎర్రి స్వామి,బాలకృష్ణ,వీధి ప్రజలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## గంగుల కమలాకర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన అనుముల భాస్కర్



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** కరీంనగర్ నియోజకవర్గ శాసనసభ్యులు గంగుల కమలాకర్ జన్మదిన వేడుకల సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా నాయకులు, నీలోజిపల్లి గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్ హృదయపూర్వక హార్ధిక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నిత్యం ప్రజాసేవలో నిమగ్నమై రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్న గంగుల కమలాకర్‌కు భగవంతుడు సంపూర్ణ ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని ఆకాంక్షించారు. అలాగే ప్రజలకు మరింత సేవ చేసే శక్తి, సామర్థ్యాలు కలగాలని కోరుకున్నారు.

## హత్య, దొంగతనం కేసులో అరెస్టైన సిద్దిపేట సీసీఎస్ కానిస్టేబుల్ ప్రవీణ్ సస్పెండ్



**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)** సిద్దిపేట జిల్లా సీసీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ప్రవీణ్ హత్య, దొంగతనం కేసులో అరెస్టు కావడంతో ఆయనను సస్పెండ్ చేస్తూ పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ ఉత్తర్వులు జారీ చేశారు. పోలీస్ శాఖలో పనిచేస్తూ నేరాలు, చట్టవ్యతిరేక కార్యకలాపాలు, అసాంఘిక చర్యల్లో పాల్గొనే వారిపై చట్టపరంగా శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. కానీ ఉద్యోగం నుండి శాశ్వతంగా తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఇలా అక్రమాలు చేసే సిబ్బంది ఒకసారి అలవాటు పడడంతో అదే రిపీట్ అవుతుంది. కాబట్టి వీరిని ఉద్యోగం నుండి శాశ్వతంగా తొలగిస్తానే భవిష్యత్తులో ప్రజలకు ఎలాంటి నష్టం జరగకుండా ఉండవని దీనిని డిజిపి దృష్టిలో ఉంచుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న వంటేరు ప్రతాప్ రెడ్డి



**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)** సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలంలోని బెజగామా గ్రామంలో నిర్వహించిన శ్రీ శ్రీ శ్రీ మడేలేశ్వర స్వామి, శీతాలమ్మ విగ్రహాల ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు బెండ మధు, చిటుకుల మధుసూదన్ రెడ్డి, షేర్పల్లె లక్ష్మణ్ గౌడ్, వెంగళ స్వామి, రాచకొండ స్వామి, ముత్యాల శ్రీకాంత్, డాక్టర్ శ్రీకాంత్, అంజయ్య, పోశయ్య, మల్లస్వామి, ఎంకమ్మల నరసయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.

## బక్రీద్ సందర్భంగా చెక్‌పోస్టులు కట్టుదిట్టం

**- వెటర్నరీ అధికారులతో పోలీస్ కమిషనర్ సమీక్ష**




**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)** బక్రీద్ పండుగ సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ , IPS జంతు సంరక్షణ మరియు వెటర్నరీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జంతువుల రవాణా, యానిమల్ ఫిట్నెస్ సర్టిఫికెట్లు, అలాగే ఆవులు మరియు ఎద్దులను గుర్తించే విధానాలపై ప్రత్యేకంగా చర్చించారు. పండుగ సమయంలో చట్ట విరుద్ధ రవాణా మరియు అక్రమ కార్యకలాపాలను అరికట్టేందుకు అన్ని చెక్‌పోస్టులను కట్టుదిట్టం చేసినట్లు తెలిపారు. జిల్లాలోని ప్రధాన రహదారులు, సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తూ వాహనాల తనిఖీలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అలాగే పశువుల రవాణా సమయంలో సంబంధిత పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు శాంతి సామరస్యాలను కాపాడుతూ పోలీసులకు సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

## మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని శుక్రవారం హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బోయినిపల్లి సెస్ డైరెక్టర్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ రాజన్న సిరిసిల్ల జిల్లా సభ్యులు కొట్టెపల్లి సుధాకర్, శాభాష్‌పల్లి గ్రామ సర్పంచ్, అఖిల భారత యాదవ మహాసభ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు ఏ.టి. యాదవ్‌లు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. అనంతరం శాలువాలతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పని చేయాలి : ఎంపీ ఈటెల రాజేందర్




**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** ప్రభుత్వ పథకాల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పనిచేయాలని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంపీ ఈటల రాజేందర్ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు చామకూర మల్లారెడ్డి (మేడ్చల్), మర్రి రాజశేఖర్ రెడ్డి (మల్కాజిగిరి), బండారి లక్ష్మారెడ్డి (ఉప్పల్), మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి , అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తో పాటు మున్సిపల్ చైర్మన్లు, అన్ని శాఖల కేంద్ర జిల్లా అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో ఎంపీ ఈటల రాజేందర్ శాఖల వారీగా సమీక్ష జరుపుతూ అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో మెరుగైన వసతులు కల్పించాలని, గర్భిణీలు మరియు పిల్లలకు పౌష్టికాహారం అందించడంలో రాజీ పడకూడదని సూచించారు. గృహ హింసకు గురవుతున్న మహిళలకు అండగా ఉండేందుకు సఖి కేంద్రాల పనితీరుపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలన్నారు. ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుతూ మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. 10 వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న ప్రాంతాల్లో పీహెచ్సీలు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన ఆయుష్మాన్ భారత్ ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలి అన్నారు, ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన పేద కార్మికులకు అత్యవసర చికిత్సను అందించడానికి అన్ని ఆసుపత్రులలో సేవలు కల్పించడానికి కృషి చేయాలనీ మెడికల్ అధికారులను ఆదేశించారు. నగర వనాల యోజన కింద పట్టణ పార్కుల అభివృద్ధిపై దృష్టి సారించాలని, రోడ్ల విస్తరణకు సంబంధించి అటవీ శాఖ త్వరగా అనుమతులను అందించాలని అన్నారు. యువతకు ఉపాధి కల్పించడానికి గాను స్కిల్ డెవలప్మెంట్ లో శిక్షణ ఇచ్చి, ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు లభించేలా చూడాలని ఎంపీ అధికారులను కోరారు. కార్మికులకు ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనాలు అందేలా చూడాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి లేవనెత్తిన అంశంపై స్పందిస్తూ, కార్మిక శాఖ కఠిన చర్యలు తీసుకోవాలని ఎంపీ ఆదేశించారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ పారిశ్రామిక విద్యా సంస్థల్లో అవగాహన సదస్సులు నిర్వహించి, బ్యాంకులు అందించే రుణాల పై అవగాహన కల్పిస్తూ , బలహీన వర్గాలకు , విద్యార్థులకు , స్వయం సహాయ సంఘాలకు , ఇతరులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం రుణాలు మంజూరు చేయాలని సూచించారు. పరిశ్రమల శాఖ ద్వారా కేంద్ర ప్రభుత్వం అందించే వివిధ పరిశ్రమలకు రుణాలను సకాలంలో అర్హులకు అందించాలన్నారు, సి ఎస్ ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధుల వివరాలను పక్కాగా సేకరించి వాటి ని వివిధ అభివృద్ధి పనులకు మౌలిక సదుపాయాలు కలిపించడానికి ఉపయోగించాలన్నారు. జిల్లా ఖనిజ నిధులను ప్రధానంగా విద్య, వైద్యం అత్యవసర మౌలిక సదుపాయాల కోసం వినియోగించాలని స్పష్టం చేశారు. కోఆపెరటివే సొసైటీలు సకాలంలో ఎన్నికలు నిర్వహించి అక్రమాలకు తావు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. చెరువులలో గుర్రపు డెక్కను తొలగిస్తూ నీరు కలుషితమయ్యే వ్యర్థాలు చెరువులలో కలవకుండా చేపలు చనిపోకుండా సంరక్షించడానికి తగిన చర్యలు తీసుకోవాలి అన్నారు. అవసరమైన వారికీ కొత్త మంచి నీటి కనెక్షన్లు ఇస్తూ ప్రతి ఇంటికి నీరు ఏకరీతిగా సరఫరా జరిగేలా చూడాలన్నారు. నేషనల్ హైవే అధికారులు రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన జరిగేలా చెర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులు మునిసిపల్ అధికారుల సమన్వయంతో ట్రాన్స్ ఫార్మర్లు, ఇతర మరమ్మతులు చేపట్టి అగ్ని ప్రమాదాలు జరగకుండా చూడాలని అన్నారు. ప్రైవేట్ పాఠశాలలు 25 శాతం ఉచిత విద్యను అందించేలా చర్యలు తీసుకోవాలని విద్యా శాఖను ఆదేశించారు. డబల్ బెడ్ రూమ్ కి సంబంధించి స్థానిక ప్రజలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రపంచ తలసేమియా దినోత్సవం సందర్భంగా గజ్వేల్ జిల్లా ఆస్పత్రిలో అవగాహన సదస్సు



**గజ్వేల్(ప్రశ్న న్యూస్)** సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని జిల్లా కేంద్ర ఆస్పత్రిలో శుక్రవారం ప్రపంచ తలసేమియా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ జన్యు మార్పుల వల్ల తలసేమియా వ్యాధి వస్తుందని తెలిపారు. ముఖ్యంగా మేనరికం, తల్లిదండ్రుల జన్యు వాహకత్వం కారణంగా పిల్లలకు ఈ వ్యాధి సంక్రమించే అవకాశం ఉంటుందని చెప్పారు. జన్యు వాహకాలైన తల్లిదండ్రుల నుంచి పుట్టే పిల్లల్లో 25 శాతం వరకు తలసేమియా వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ మీనా మాట్లాడుతూ తలసేమియా పుట్టుకతో వచ్చే రక్త సంబంధిత వ్యాధి అని, ఎముక మజ్జ తగినంత ఎర్ర రక్త కణాలు తయారు చేయకపోవడం వల్ల తీవ్రమైన రక్తహీనత ఏర్పడుతుందని వివరించారు. పాలిపోయిన చర్మం, ఎదుగుదల లోపించడం, కళ్ల పసుపు రంగు మారడం, తరచూ ఇన్‌ఫెక్షన్లు రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం. శ్రీనివాస్, డాక్టర్ సుమన్, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రణీత, నర్సింగ్ మరియు పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

## 15 వ వార్డ్‌లో ఘనంగా ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభోత్సవం

**- ప్రజా సంక్షేమం కాంగ్రెస్ ధ్యేయం**

**- ఏ ఏం సి చైర్మన్ నరేందర్ రెడ్డి**



**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో శుక్రవారం ఘనంగా ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. స్థానిక కౌన్సిలర్ నక్క సంతోషి రాములు గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ గృహప్రవేశంలో లబ్ధిదారుల ఇంట్లో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో నేతలు పాల్గొన్నారు. నూతన గృహంలోకి అడుగుపెట్టిన లబ్ధిదారులకు మిఠాయిలు తినిపించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పేదవాడికి సొంత ఇల్లు ఉండాలన్నదే కాంగ్రెస్ పార్టీ ప్రధాన ఆశయం అన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గూడు కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే సంక్షేమ పథకాలు రాజకీయాలకు అతీతంగా ప్రతి ఇంటికి చేరుతాయని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పట్టణ అధ్యక్షులు మోనగారి రాజు, ఏడవ వార్డు కౌన్సిలర్ విష్ణువర్ధన్ రెడ్డి, సీనియర్ నాయకులు గాడిపల్లి శ్రీనివాస్, సమీర్, అయిత సత్యనారాయణ, సారిక శ్రీనివాస్ రెడ్డి, నాగరాజు నేత, సత్యనారాయణ, శ్రవణ్, మామిడి సురేష్, అశోక్, ఇందిరమ్మ ఇల్లు,లబ్ధిదారులు, స్థానిక నాయకులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక అవగాహన సదస్సు

**- సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా నిర్వహణ**




**మేడ్చల్( ప్రశ్న న్యూస్ )** ఆర్ట్ ఆఫ్ లివింగ్ సహకారంతో సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల జాతీయ సేవా పథకం విభాగం ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్యం అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం, ఒత్తిడి నుంచి బయటపడే మార్గాలను తెలియజేయడం, ధ్యానం, యోగాభ్యాసం ద్వారా మానసిక ప్రశాంతత సాధించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ ఆర్ట్ ఆఫ్ లివింగ్ బోధకులు జి.ఎన్. ప్రణయ్ కుమార్ నాయుడు, గడ్డం ధనలక్ష్మి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీరికి యోగాభ్యాసం, ధ్యానం మానసిక శిక్షణలో 15 సంవత్సరాలకు పైగా అనుభవం ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసంగించిన ప్రణయ్ కుమార్ నాయుడు మాట్లాడుతూ, ప్రస్తుతం యువతలో మానసిక ఒత్తిడి, ఆందోళన, నిరాశ వంటి సమస్యలు పెరుగుతున్నాయని తెలిపారు. చదువు, పోటీ ప్రపంచం, వ్యక్తిగత సమస్యలు వంటి కారణాలతో విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని చెప్పారు. అలాంటి పరిస్థితుల్లో యోగాభ్యాసం, ధ్యానం, శ్వాసాభ్యాసాలు మనసుకు ప్రశాంతతనిచ్చి జీవన విధానాన్ని మెరుగుపరుస్తాయని వివరించారు. గడ్డం ధనలక్ష్మి మాట్లాడుతూ, “మనసును సమతుల్యంగా ఉంచితే జీవితం ప్రకాశవంతమవుతుంది” అనే సందేశాన్ని విద్యార్థులకు అందించారు. ప్రతి విద్యార్థి తన మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అత్యంత ముఖ్యమని, శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యానికీ సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రతిరోజూ కొంత సమయం ధ్యానం, యోగాభ్యాసం కోసం కేటాయిస్తే మనస్సు ప్రశాంతంగా ఉండి ఏకాగ్రత పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులకు ధ్యానం, శ్వాస వ్యాయామాలు, ఒత్తిడి నియంత్రణ పద్ధతులపై ప్రాయోగిక శిక్షణ కూడా అందించారు. విద్యార్థులు ఎంతో ఆసక్తిగా పాల్గొని నిపుణులు చెప్పిన సూచనలను శ్రద్ధగా ఆలకించారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో కొత్త ఉత్సాహం, ఆత్మవిశ్వాసం పెరిగిందని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమానికి కళాశాల అధ్యక్షుడు టి. బాలారెడ్డి, కార్యదర్శి టి.వి. రెడ్డి, విద్యా సంచాలకురాలు టి. సరోజా రెడ్డి, పరిపాలనా సంచాలకుడు టి. అనురాగ్ రెడ్డి, ప్రధానాచార్యులు డాక్టర్ కె. వెంకట్ రావు, జాతీయ సేవా పథకం కార్యక్రమాధికారి డాక్టర్ ఆసాం రాజేష్ తమ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని వారు అభిప్రాయపడ్డారు.

## బండి సంజయ్ రౌడీ రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారు - బీఆర్ఎస్ నేతలు

**- వేములవాడలో బీఆర్ఎస్ ధర్నా**

**- ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై దాడిని ఖండించిన నేతలు**



వేములవాడ (ప్రశ్న న్యూస్)తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ గుండాల దాడులు రోజురోజుకు పెరుగుతున్నాయని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. కరీంనగర్‌లో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పై జరిగిన దాడిని నిరసిస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ పట్టణంలోని తెలంగాణ చౌక్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తెలంగాణ చౌక్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు నిరసన ర్యాలీ చేపట్టిన నాయకులు “బీజేపీ గుండాలారా ఖబర్దార్” అంటూ నినాదాలు చేశారు. కరీంనగర్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పై బీజేపీ గుండాలు హత్యాయత్నం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి బీఆర్ఎస్ పార్టీ నేతలను లక్ష్యంగా చేసుకొని ఇబ్బందులకు గురిచేస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా దెబ్బతిన్నదని ఆరోపించిన వారు, కరీంనగర్ పట్టణ నడిబొడ్డున గన్‌తో దొంగతనాలు జరుగుతున్నా కేంద్ర మంత్రి, ఎంపీ బండి సంజయ్ పట్టించుకోవడం లేదన్నారు. ఎమ్మెల్యే స్థాయి నాయకులకే రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ రౌడీ రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపిస్తూ, అభివృద్ధిపై రాజకీయ చర్చలు జరగాలి గానీ భౌతిక దాడులు చేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని హెచ్చరించారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వాహనం, క్యాంపు కార్యాలయంపై జరిగిన దాడిపై బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే బీఆర్ఎస్ నాయకురాలు పావని గౌడ్‌పై దాడి చేసేందుకు ప్రయత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రామతీర్థపు రాజు, నిమ్మశెట్టి విజయ్, వెంగళ శ్రీకాంత్ గౌడ్, సిరిగిరి చందు, మారం కుమార్, వాసాల శ్రీనివాస్, కందుల క్రాంతి కుమార్, గన్నమనేని రామారావు, కొండ కనుకయ్య, నీలం శేఖర్, నీరటి మల్లేశం, అంజద్ పాషా, లైసెట్టి మల్లేశం, గుడిసె సదానందం, రేగుల రాజేశం, ఉల్లెందుల హనుమంతు, సుంకపాక రాజు, నిమ్మశెట్టి రాజు, గోసుకుల నరసయ్య, పబ్బ మహేష్, సంజీవ్, మంత సందీప్, మామిండ్ల కనకయ్య, రాధాకిషన్ రావు, పెద్ది రాజు, సయ్యద్ ఉమర్, రఫిక్, అసద్, షాహిద్, నల్ల సతీష్ రెడ్డి, మెండే రాజు, మణి తదితరులు పాల్గొన్నారు.



### హిందీలో అవకాశాలు లేనివారే సౌత్ వైపు వెళతారనే
# అభిప్రాయం అప్పట్లో ఉండేది: సమీరారెడ్డి

దక్షిణాది సినిమాలపై తనకున్న గౌరవాన్ని సినీ నటి సమీరారెడ్డి మరోసారి చాటుకున్నారు. తన కెరీర్ ఆరంభంలో నాటి అనుభవాల గురించి ఓ ఇంటర్వ్యూలో ఆమె పంచుకున్నారు. సమీరారెడ్డి కెరీర్ మొదట్లో హిందీ సినిమాలతో బిజీగా ఉన్నప్పుడు, ఆమె టీమ్ సభ్యులు దక్షిణాది సినిమాల వైపు వెళ్లొద్దని హెచ్చరించారట. "హిందీలో అవకాశాలు లేని వారే సౌత్ వైపు వెళతారు" అనే తప్పుడు అభిప్రాయం అప్పట్లో ఉండేదని ఆమె గుర్తు చేసుకున్నారు. కానీ, ఒక సౌత్ ఇండియన్ అమ్మాయిగా తన మూలాలను గౌరవిస్తూ, ఆ మాటలను పక్కన పెట్టి జూనియర్ ఎన్టీఆర్ వంటి స్టార్ల సరసన నటించడానికి ఆమె సిద్ధపడ్డారు. చిరంజీవి, ఎన్టీఆర్, సూర్య, అజిత్ వంటి దిగ్గజాలతో పనిచేయడం తన కుటుంబానికి, ముఖ్యంగా తన తండ్రికి గర్వకారణమని ఆమె సగర్వంగా చెప్పుకొచ్చారు. ప్రస్తుతం బాలీవుడ్ అగ్ర హీరోయిన్లు సౌత్ సినిమాల కోసం పోటీ పడుతున్న విషయాన్ని సమీరా గుర్తు చేశారు. దక్షిణాది దర్శకులు కొత్త ప్రయోగాలు చేయడానికి, రిస్క్ తీసుకోవడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని, అందుకే ఇక్కడి సినిమాలు సాంకేతికంగా, యాక్షన్ పరంగా ఎప్పుడూ ముందంజలో ఉంటాయని ఆమె విశ్లేషించారు. హిందీ మేకర్స్ తరచుగా 'సేఫ్ జోన్'లో ఉండాలని చూస్తారని ఆమె అభిప్రాయపడ్డారు. దాదాపు దశాబ్ద కాలం పాటు వెండితెరకు దూరంగా ఉన్న సమీరా, ఇప్పుడు సంజయ్ దత్ సరసన 'ఆఖరి సవాల్' చిత్రంతో మళ్లీ ప్రేక్షకులను పలకరించబోతున్నారు. ఇది తన కమ్ బ్యాక్ కాదని, కేవలం ఒక చిన్న విరామం తర్వాత చేస్తున్న ప్రయాణమని ఆమె స్పష్టం చేశారు.

### బాక్సాఫీస్ వద్ద
# 'ధురంధర్ 2' సునామీ..
### 50 రోజుల్లో సృష్టించిన రికార్డులు ఇవే!



రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో, ఆదిత్య ధర్ దర్శకత్వంలో వచ్చిన 'ధురంధర్ 2: ది రివెంజ్' బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ చిత్రం విజయవంతంగా 50 రోజులు పూర్తి చేసుకుని భారతీయ సినిమా చరిత్రలో కళ్లు చెదిరే రికార్డులను నెలకొల్పింది. మార్చి 19న విడుదలైన ఈ స్పై థ్రిల్లర్, ఏడు వారాలు గడిచినా ఇంకా థియేటర్లలో బలంగా కొనసాగుతోంది. అయితే ఈ సినిమా ఇప్పటివరకు రూ.1791 కోట్ల వసూళ్లను సాధించడంతో పాటు పలు రికార్డులను నమోదు చేసింది. అయితే ఆ రికార్డులు ఏంటి అనేది చూసుకుంటే. బాహుబలి 2 రికార్డ్ బ్రేక్: ప్రపంచవ్యాప్తంగా అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ సినిమాల జాబితాలో 'బాహుబలి 2స (రూ.1,788 కోట్లు) రికార్డును అధిగమించి, 'దంగల్' తర్వాత రెండవ స్థానాన్ని కైవసం చేసుకుంది. రూ. 1000 కోట్ల క్లబ్: భారతదేశంలో రూ.1,000 కోట్ల నెట్ కలెక్షన్ సాధించిన తొలి హిందీ సినిమాగా ధురంధర్ 2 చరిత్ర సృష్టించింది. అలాగే కేవలం 6 రోజుల్లోనే రూ.500 కోట్లు, మొదటి వారంలోనే రూ.1,000 కోట్ల వరల్డ్‌వైడ్ గ్రాస్‌ను అందుకున్న ఏకైక హిందీ చిత్రంగా రికార్డును నెలకొల్పింది. ఆదిత్య ధర్ అద్భుతమైన టేకింగ్, రణ్‌వీర్ సింగ్ పవర్‌ఫుల్ యాక్షన్, మరియు సంజయ్ దత్, అర్జున్ రాంపాల్ వంటి స్టార్ కాస్ట్ ఈ సినిమా విజయానికి ప్రధాన కారణంగా నిలిచాయి.

# రేజర్' మూవీ రివ్యూ



నటుడు, దర్శకుడు, నిర్మాత రవిబాబు కొత్తతరహా సినిమాలతో ప్రయోగాలు చేస్తుంటాడు. సక్సెస్, ఫెయిల్యూర్స్‌తో సంబంధం లేకుండా తన ప్రయాణాన్ని కొనసాగిస్తుంటాడు. ఇటీవల కొంత విరామం తరువాత ఆయన స్వీయ దర్శకత్వంలో చేసిన సినిమా 'రేజర్'. ఈ చిత్రంలో రవిబాబు ప్రధాన పాత్రలో నటించాడు.ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రం ఎలా వుంది? ఈ చిత్రంలో ప్రేక్షకులను అలరించే అంశాలున్నాయా? లేదా రివ్యూలో తెలుసుకుందాం. రాష్ట్ర హోమ్ మంత్రి కనకరాజు సీఎం పదవిని ఆశించి అతని కొడుకులతో కలిసి ముఖ్యమంత్రి సీతారాయమ్యను చంపేస్తారు. అయితే సీఎం ఫామ్ హౌస్‌లో అతడ్ని చంపుతున్న దృశ్యాలు అనుకోకుండా సీసీ టీవీ కెమెరాల బిజినెస్ చేసే విష్ణు (తనీష్) చేతికి దొరుకుతాయి. ఈ విషయం హోమ్ మంత్రి, అతని కొడుకులకు తెలియడంతో వాళ్లు విష్ణును, అతని భార్యను చంపేస్తారు. అయితే ఈ మర్డర్స్‌ను విష్ణు కూతురు తేజు చూస్తుంది. ఇక అదే సమయంలో ఆ ఇంటికి వారి డాగ్‌ను గ్రూమింగ్ చేయడానికి వచ్చిన మొబైల్ పెట్ గ్రూమింగ్ బిజినెస్ యజమాని రుద్ర (రవిబాబు) ఆ దుండగుల నుంచి తేజును కాపాడతాడు. అయితే విష్ణు చనిపోయే ముందు సీఎంను హత్య చేసిన వీడియో క్లిప్పింగ్స్ ఎక్కడ ఉన్నాయో, తన కూతురు తేజుకు అసంపూర్తిగా చెప్పి చనిపోతాడు. ఇక తేజు పాపను హోమ్ మంత్రి, అతని బృందం చంపడానికి ఎన్ని సార్లు ప్లాన్ చేసిన రుద్ర వాళ్లను అడ్డుకుంటాడు. ఇక సీఎంను చంపే ఆ వీడియో క్లిప్పింగ్స్‌ను రుద్ర ప్రభుత్వానికి అప్పగించాడా? పాపను ఎలా కాపాడాడు? చివరికి ఏం జరిగింది? కనకరాజు సీఎం అయ్యాడా? ఈ విషయాలు తెలియాలంటే పూర్తి సినిమా చూడాలి. ఈ సినిమాను మొదట్నుంచీ యాక్షన్ సర్వైవల్ థ్రిల్లర్ అంటూ ఇంటర్వ్యూల్లో చెప్పుకొచ్చారు దర్శక, నిర్మాత రవిబాబు. సినిమా ప్రారంభం కాస్త ఇంట్రెస్టింగ్‌గానే అనిపించినా.. కథనం ముందుకు వెళుతున్న కొద్దీ ఆసక్తి సన్నగిల్లుతుంది. కథలో ఏ మాత్రం కొత్తదనం లేకుండా కథానాన్ని నడిపించడం కష్టమే. ఆ ఇబ్బంది ఈ సినిమాకు ప్రారంభం నుంచి కనిపించింది. కథ, కథనాల కంటే ముఖ్యంగా యాక్షన్‌తో కూడిన హింసాత్మక సన్నివేశాలపై రవిబాబు దృష్టిపెట్టినట్లు అనిపించింది. ఈ చిత్రంలో రవిబాబు హింసను హద్దులు దాటించాడు. తలలను, శరీరాలను అత్యంత పాశవికంగా నరుక్కుంటూ వెళ్లిపోతాడు. ఈ చిత్రంలో కొన్ని సన్నివేశాలను సున్నిత మనస్కులు చూడలేరు. థియేటర్‌లో రెగ్యులర్‌గా సినిమా చూసే ఆడియన్స్ కూడా అలాంటి సన్నివేశాలు వచ్చినప్పుడు కళ్లు మూసుకుని ఉన్నారంటే ఆ సీన్స్ ఎంతో క్రూరంగా ఉన్నాయో ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. ఈ సినిమాకు రవిబాబు తన కన్వీనెంట్ రైటింగ్‌తో ఎటువంటి లాజిక్‌లు లేకుండా సన్నివేశాలను అల్లుకున్నాడు. అయితే ఈ కథకు ప్రస్తుత టెక్నాలజీని లింక్ చేసి స్క్రీన్‌ప్లేలో వేగం పెంచాలని రవిబాబు చేసిన ప్రయత్నం మాత్రం అలరిస్తుంది. సీఎం మర్డర్‌కు సంబంధించిన క్లిప్పింగ్స్ ఎక్కడా ఉన్నాయో తెలుసుకోవడానికి చేసిన ప్రయత్నం, ఆ తరువాత ఆ క్లిప్పింగ్స్‌ను ఎవరి కంటా పడకుండా విష్ణు వాటిని దాచిపెట్టిన విధానం దాని కోసం అతను సాంకేతిక పరిజ్ఞానాన్ని యూజ్ చేసకున్న విధానం ఇంట్రెస్టింగ్‌గా అనిపించింది. అయితే రవిబాబు ఇలాంటి కథకు ప్రేక్షకుల్లో క్యూరియాసిటిని కలిగించే స్క్రీన్‌ప్లేను అల్లుకునే విషయంలో రచనా పరంగా మరింత టైమ్‌ను కేటాయిస్తే బెటర్ అవుట్‌పుట్ వచ్చేది. అత్యంత పాశవికంగా కనిపించిన ఆ హింస సన్నివేశాల డోసు విషయంలో కూడా కేర్ తీసుకోని ఉంటే సినిమాను ప్రేక్షకులు చూసే కోణం మారేది. ఓవరాల్‌గా లాజిక్ లేని కథ, కథనాలతో రవిబాబు క్రియేట్ చేసిన ఈ హింస చూడాలంటే ఈ హింసను భరించే ఓపికతో పాటు ధైర్యం కూడా కావాలి. రవిబాబు సీరియస్ మూడ్‌లో తన పాత్రకు న్యాయం చేశాడు. సినిమా ఆద్యంతం రవిబాబే కనిపిస్తాడు. మిగతా పాత్రలు అలా వచ్చి వెళ్లిపోతాయి అంతే. ఈ సినిమా నేపథ్య సంగీతం, యాక్షన్ సన్నివేశాల డిజైన్ ఆకట్టుకుంటుంది. ఫోటోగ్రఫీ కూడా బాగుంది. విపరీతమైన హింస, లాజిక్ లేని కథ, కథనాలతో తెరకెక్కిన ఈ రేజర్‌కు ప్రేక్షకుల మెప్పు పొందడం కష్టమే. ఈ రేజర్ మేజర్ ఆడియన్స్‌ను అలరించే అవకాశాలు చాలా తక్కువ.

### తూర్పుకనుమల్లో
# ప్రేమకథ



తేజేష్ రాజన్, ఐరా అగర్వాల్ జంటగా నటిస్తున్న చిత్రం 'అమరం'. తిరుఅరుల్ కృష్ణన్ దర్శకుడు. బుధవారం టీజర్‌ను విడుదల చేశారు. తూర్పు కనుమల నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కించామని, ఎర్రచందనం స్మగ్లర్..ఓ యువతి చుట్టూ కథ నడుస్తుందని, స్మగ్లర్ల జీవన శైలి, వారి ప్రపంచంలో దాగి ఉన్న వాస్తవాలను ఈ సినిమా చూపిస్తుందని మేకర్స్ తెలిపారు.ఇంటెన్స్ యాక్షన్, ఎమోషన్స్ ప్రధానంగా ఈ సినిమా ఆకట్టుకుంటుందని, ప్రేమకథ హార్ట్‌టచింగ్‌గా అనిపిస్తుందని దర్శకుడు తెలిపారు. జార్జ్ మరియన్, నాగినీడు, సాయిధీనా తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జే మేయర్, దర్శకత్వం: తిరుఅరుల్ కృష్ణన్.

### నిఖిల్ 'స్వయంభు'
# షూటింగ్..
### అడవిలో కొండపై చిక్కుకుపోయిన చిత్ర బృందం!



నిఖిల్ హీరోగా భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో రాబోతున్న చిత్రం 'స్వయంభు'. కాగా, ఈ సినిమా షూటింగ్ సమయంలో తమకు ఎదురైన ఒక భయానక అనుభవాన్ని దర్శకుడు భరత్ కృష్ణమాచారి పంచుకున్నారు. సినిమాలోని కీలక సన్నివేశాల చిత్రీకరణలో చిత్ర బృందం ఎదుర్కొన్న సవాళ్లను ఆయన మీడియాకు వివరించారు.సినిమాలోని యాక్షన్ సన్నివేశాలను ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రికి సమీపంలో ఉన్న మారేడుమిల్లి అడవుల్లో చిత్రీకరించినట్లు భరత్ తెలిపారు. గతంలో 'పుష్ప' సినిమాలోని అటవీ సన్నివేశాలు చిత్రీకరించింది కూడా ఇదే ప్రాంతంలో కావడం గమనార్హం. అయితే, తాము మాత్రం ఇంతకుముందు ఎవరూ షూటింగ్ చేయని కొత్త ప్రదేశాలను ఎంచుకున్నామని ఆయన అన్నారు. ఆ ప్రాంతాలకు చేరుకోవడానికి జీపుల్లో రెండు నుంచి రెండున్నర గంటల సమయం పట్టేదని చెప్పారు. "ఒక షెడ్యూల్ సమయంలో అనుకోకుండా భారీ వర్షాలు పడటంతో, మా సిబ్బందిలో కొంతమంది దాదాపు ఒకటి రెండు రోజులు కొండపైనే చిక్కుకుపోయారు. వారు కిందికి వచ్చే మార్గంలేదు. వారి వద్ద కనీస సామాగ్రి కూడా లేదు" అని ఆ భయానక అనుభవాన్ని గుర్తుచేసుకున్నారు.సినిమా నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన భారీ సెట్ల వివరాలను కూడా ఆయన వెల్లడించారు.

హైదరాబాద్‌లోని జన్వాడలో 6 నుంచి 8 ఎకరాల విస్తీర్ణంలో సుమారు 45 రోజులు శ్రమించి ఒక పూర్తిస్థాయి గ్రామం సెట్‌ను నిర్మించినట్లు తెలిపారు. ఇక సినిమా క్లైమాక్స్‌ను అన్నపూర్ణ స్టూడియోలో 70 నుంచి 80 రోజుల పాటు చిత్రీకరించినట్లు చెప్పారు. ఇందులో భాగంగా రెండు భారీ వంతెనల సెట్లను నిర్మించామని, వాటిలో ఒకటి కూల్చివేయడానికే ప్రత్యేకంగా తయారుచేశామని అన్నారు. ఈ బ్రిడ్జి దాదాపు 100 అడుగుల పొడవు ఉంటుందని పేర్కొన్నారు.పిక్సెల్ స్టూడియోస్ పతాకంపై భువన్, శ్రీకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం త్వరలోనే ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

### మాస్ మెచ్చేలా
# పవర్ పేట



సందీప్ కిషన్ కథానాయకుడిగా 'పవర్ పేట' పేరుతో ఓ యాక్షన్ ఎంటర్‌టైనర్ రూపొందుతున్నది. రచయిత కృష్ణ చైతన్య దర్శకుడు. విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మాతలు. గురువారం సందీప్‌కిషన్ పుట్టిన రోజు సందర్భంగా ఈ సినిమా గ్లింప్స్‌ని మేకర్స్ విడుదల చేశారు. అభిమానుల అరుపులు, సంబరాల మధ్య ఓ సినిమా థియేటర్‌లో గ్లింప్స్ మొదలైంది. ఆ కోలాహలం మధ్య హీరో ఎంట్రీ.. సిగరెట్ తాగుతూ, సింహం గురించి పవర్‌ఫుల్ డైలాగ్ చెప్పడంతో థియేటర్‌లో అరుపులు మిన్నంటాయి. థియేటర్ స్క్రీన్‌పై బాణాసంచా విసరడంతో గ్లింప్స్ పూర్తయింది. సందీప్‌కిషన్ ఈ గ్లింప్స్‌లో పీరియాడిక్ అవతార్‌లో కనిపించారు. స్టైలిష్ షేడ్స్, కలర్‌ఫుల్ కాస్ట్యూమ్స్, 'రా' ఆటిట్యూడ్.. ఇవన్నీ మాస్ ప్రేక్షకులు మెచ్చేలా ఉన్నాయి. ఈ గ్లింప్స్‌లోని ఆయన పాత్ర పేరు 'సేనాపతి రవి' అని రివీల్ చేశారు. సందీప్ కిషన్ స్క్రీన్ ప్రెజన్స్, డైలాగ్ డెలివరీ ఆ పాత్రలోని డామినేషన్, ఇంటెన్సిటీని సూచిస్తున్నాయి. షూటింగ్ శరవేగంగా పూర్తి చేసుకుంటున్న ఈ చిత్రానికి కెమెరా: మదీ, సంగీతం: మణిశర్మ, నిర్మాణం: 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్.

# డిజిపి సివి ఆనంద్‌తో బిఆర్ఎస్ నేతలు భేటీ

- డీజీపీని కలసిన బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు - డిజిపిని కలిసి రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యపై ఫిర్యాదు
- కరీంనగర్ లో నిన్న మాజీ మంత్రి గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయం తో పాటు కౌశిక్ రెడ్డి వాహనంపై బీజేపీ కార్యకర్తల దాడి
- ఈ అంశంపై డిజిపికి ఫిర్యాదు చేసిన బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు
- బిఆర్ఎస్ నేతలపై దాడులను అరికట్టాలని, శాంతిభద్రతలను కాపాడాలని ఫిర్యాదు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య రోజు రోజుకు దిగజారి పోతున్నాయని బిఆర్ఎస్ నేతలు నిన్న శుక్రవారం తెలంగాణ డిజిపి సివీ ఆనంద్ కలిసి వెల్లడించారు.మరీ ముఖ్యంగా భాజపా నేతలు బిఆర్ఎస్ నాయకుల పై రౌడీలు,గుండాలు వలే ఈ మధ్య విరుచుకుపడ్డారు.రాష్ట్రంలో బిహార్ సంస్కృతి కొనసాగుతుంది.

### ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి..

తెలంగాణ రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా దిగజారిపోయాయి.వెనుకబడిన రాష్ట్రాలలో ఏ విధంగా ఉన్నదో అదే తెలంగాణలో రాష్ట్రంలో కొనసాగుతుంది.నచ్చని రాజకీయ పార్టీల నేతల కార్యాలయాల పై,నేతలఇండ్లపై దాడులు చేస్తున్నారు.కరీంనగర్లో పోలీసుల చేతగాని తనాన్ని డిజిపికి వివరించామని పేర్కొన్నారు.అలాగే మొన్న కౌశిక్ రెడ్డి పై దాడి వివరిస్తూ,ఆయన చంపాలని వచ్చారు.భాజాపా ఎంపీ కేంద్ర సహాయ హోం శాఖ మంత్రి బండి సంజయ్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే మేము సమాధానం చెప్పాలి గా,ఈ రాద్ధాంతం అంతా బండి సంజయ్ రెచ్చ గొడితే కార్యకర్తలువచ్చారు. ముందుగాబండి సంజయ్ పై కేసు నమోదు చేయాలి.ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి కి భద్రత పెంచాలని డిజిపి ని కోరినట్లు ఆయన తెలిపారు.

### ఎమ్మెల్యే వివేకానంద గౌడ్..

బండి సంజయ్, ముఖ్యమంత్రి చీకటి ఒప్పందాలు.వ్యాపారాలు రాష్ట్రంలో అందరికి తెలుసన్నారు.ముఖ్యమంత్రికి ఎప్పుడు ఆపద వచ్చిన సహాయ మంత్రి సిఎం కి సహాయంగా ఉంటున్నారు.బండి సంజయ్ కి ఆహాకారం పెరిగింది.ఎంత తగ్గించుకుంటే అంత మంచిది లేకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని వివేక్ తెలిపారు.గతంలో ఆయన 2014 ముందు బండి సంజయ్ ఏ విధంగా వసూలు చేశారో మాకు తెలుసు.మీ భాష పై మీ విధానంలో చెబితే దాడులు చేస్తారా..?కౌశిక్ రెడ్డి ఏమి తప్పు మాట్లాడారో చెప్పాలి.కేటీఆర్ ను డ్రగ్స్ అంటావ్,మేము అదే భాష లో భవిష్యత్తులో సమాధానం చెబుతాం.రేపు వచ్చేది మా ప్రభుత్వం.అప్పుడు బండి సంజయ్ గుజరాత్ వెళ్ళి తల దాచుకోవాలి.వీరి అరాచకం, చేస్తున్న రౌడీయిజం పై అన్ని ఆధారాలు డీజీపీ కి ఇచ్చామన్నారు.ఫిర్యాదులో మొదటి వ్యక్తి సంజయ్ నీ ఏ1 గా చేర్చాలి.రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెబుతాం..

### ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్..

రాజ్యాంగాన్ని రక్షించాల్సిన హోంశాఖ సహాయ మంత్రి గుండాలను పెట్టి కొట్టిస్తున్నారు.ప్రభుత్వమే ప్రభుత్వ ఆస్తులపై దాడులు చేస్తుండ్రు.నేరస్తులు మంత్రులు అవుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో నేలపూరిత పాలన జరుగుతుంది.వరుస పెట్టి బి ఆర్ ఎస్ ఎమ్మెల్యేల కార్యాలయాలపై దాడులు జరుగుతున్నాయి. పోలీసులు గుండాలను బతిమిలాడుతున్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అమలవుతున్నాయా.? కేసీఆర్ ను అవమానిస్తూ దారుణమైన మాటలు మాట్లాడినా కూడా ఎక్కడ కూడా ఫ్యాక్షనిస్టు సంస్కృతితో దాడులు చేయలేదు.బండి సంజయ్ నోటి నుంచి ఒక్క మంచి మాట వినలేదు.బండి సంజయ్ రామాయణం ఉపనిషత్తులు చదివాడా.? ఆయనకు ఏమైనా వచ్చా.? బీహార్ సంస్కృతి తెలంగాణలో రావద్దని డీజీపీ నీ కోరినట్లు దేశపతి తెలిపారు.దాడులు ఇలాగే జరిగితే ఆత్మ రక్షణ కోసం ప్రతిదాడులు చేయాల్సి పరిస్థితి ఏర్పడుతుంది.

### ఎమ్మెల్సీ దసోజ్ శ్రవణ్..

భగవంతుని దయవల్ల ఇవాళ కౌశిక్ రెడ్డి బతికి ఉన్నాడు.భారత్ మాతాకీ జై అనే వారి నోటి నుంచి వచ్చే మాటలేనా.?కేసిఆర్ కి పుట్టావా అని బండి సంజయ్ అనడం హోంశాఖ సహాయ మంత్రి లాంగ్వేజా.మీ భాష తో మీ బిజెపి పార్టీని బొంద పెడుతున్నారు. ఎమ్మెల్సీ దసోజ్ శ్రవణ్.

ఐపీఎస్ ఆఫీసర్ భార్య గొంతు కోసి చంపేశారు. హైదరాబాద్ మహానగరంలో రాష్ట్రం మొత్తంలో శాంతిభద్రతలు ఎక్కడున్నాయి.?మహిళా కమిషనర్ బి.సుమతి నాలుగు రోజుల క్రితం దిలుషుక్ నగర్ రోడ్డు పై మూడు గంటల పాటు నిలబడితే పోకిరీల అల్లరీలు చూసి అధికారులే అవాక్కయ్యారు అంటే పరిస్థితులు రాష్ట్రంలో ఏ విధంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.ఇప్పటికైనా అధికారులు శాంతిభద్రతల విషయంలో నిక్కచ్చిగా వ్యవహరించాలని బిఆర్ఎస్ నేతలు డిజిపి ని కోరారు.

## తెలంగాణ రాష్ట్ర బీజేపీ చీఫ్ రామచంద్ర రావుని కలిసి వినతిపత్రం

- విశ్వభక్తి సేవా ప్రచార్ ప్రతినిధులు



**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** భారతదేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ హైదరాబాద్ పర్యటన సందర్భంగా తెలంగాణ బీజేపీ అధ్యక్షులు రామచంద్ర రావు ని విశ్వభక్తి సేవా ప్రచార్ ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందజేశారు."విశ్వ కళ్యాణార్థం, సర్వే జనాః సుఖినోభవంతు" అనే మహోన్నత సంకల్పంతో దేశవ్యాప్తంగా ప్రతి శ్రీరామాలయంలో భక్తులచే నిర్వహించనున్న "జై శ్రీరామ్ లక్ష కోటి నామ జప మహాయజ్ఞం" కార్యక్రమానికి ఆశీస్సులు, సహకారం అందించాలని ప్రధానమంత్రి కు మా సందేశాన్ని అందించాలని వారు కోరారు. సమాజంలో భక్తిభావం,శాంతి,సేవాతత్వం,మానవతా విలువలు మరింత బలపడేలా ఈ మహాయజ్ఞాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ప్రజల ఆధ్యాత్మిక చైతన్యానికి దోహదపడే ఈ కార్యక్రమానికి ప్రజలందరూ భాగస్వాములు కావాలని మీడియా ద్వారా పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా శ్రీ స్వామి ఓం స్వరూప్ గురూజీ,పారువెల్లి దుర్గభవాని(సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్టు),విజయసంకల్పం ప్రసాద్(సీనియర్ ఫ్రీలాన్స్ పొయట్ జర్నలిస్టు) తదితరులు పాల్గొన్నారు. .

## ఎస్పీఎఫ్ సిబ్బంది 10 కిలోమీటర్ల పరుగు అనంతరం కల్యాణకట్టలో 'స్వచ్ఛ భారత్



**యాదగిరిగుట్ట(ప్రశ్న న్యూస్)** టీజీ ఎస్పీఎఫ్ డీజీ స్వాతి లాక్రా ఆదేశాల మేరకు, యాదగిరిగుట్ట ఆలయ భద్రతా విభాగం సిబ్బంది శుక్రవారం తులసి కాటేజ్ నుండి మల్లాపురం వరకు 10 కిలోమీటర్ల పరుగు నిర్వహించారు. అనంతరం కొండ కింద ఉన్న కల్యాణకట్ట వద్ద 'స్వచ్ఛ భారత్' కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆలయ కార్యనిర్వహణ అధికారి జె. భవాని శంకర్ పాల్గొనగా, ఎస్పీఎఫ్ అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఎస్ పి ఎఫ్ ఇన్స్పెక్టర్ కే. శేషగిరి రావు తెలిపారు.కార్యక్రమంలో భాగంగా సేకరించిన చెత్తను ట్రాక్టర్ ద్వారా సురక్షితంగా తరలించారు. ఈ సేవలో ఎస్ఐ రవి, ఏఎస్ఐలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఆండాళ్ అమ్మవారికి ఉంజల్ సేవ



**యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్)** శుక్రవారం సందర్భంగా యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ఆండాళ్ అమ్మవారికి ఉంజల్ సేవను కన్నుల పండుగగా నిర్వహించారు ఆలయ అర్చకులు.ఆండాళ్ అమ్మవారిని ఆలయ తిరు మాడ వీధుల్లో సేవపై ఊరేగించారు.ఆండాళ్ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేపట్టారు.ప్రధానాలయం లోని అద్దాల మండపంలో ఉయ్యాల పై అమ్మవారిని వివిధ రకాల పుష్పాలు,తులసి దళాలతో అలంకరించి ఆరాధించారు.హారతి నివేదించారు అర్చకులు.మేళతాళాలు, మంగళ వాయిద్యాలు వేద మంత్రాల నడుమ ఉంజల్ సేవ నిర్వహించి ఆండాళ్ అమ్మవారికి నివేదన సమర్పించారు.ఆండాళ్ అమ్మవారి సేవలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

## ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం

- విలాసాగర్ సర్పంచ్ : ఏనుగుల కనకయ్య



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలం, విలాసాగర్ గ్రామంలో ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం లబ్ధిదారులు తడుక మమత--రాజు దంపతుల నూతన గృహ ప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ ఏనుగుల కనకయ్య, ఉపసర్పంచ్ పొత్తూరి శైలజ--రాజు హాజరై గృహప్రవేశాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ ఏనుగుల కనకయ్య మాట్లాడుతూ పేదల సొంతింటి కల కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమైందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తూ సంక్షేమ పథకాల అమలులో ముందుంటుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు దమ్మ వెంకట రమణ, జోగు శంకర్, యూత్ కాంగ్రెస్ నాయకులు ఏనుగుల ప్రశాంత్ కుమార్, వివో అధ్యక్షురాలు ఆకుల లలితతో పాటు ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్రాభివృద్ధిలో పొన్నం భాగస్వామ్యం ప్రశంసనీయం

- మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు
- కాంగ్రెస్ పార్టీ మండల యువ నాయకులు : కొలుపుల ప్రవీణ్



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు కొలుపుల ప్రవీణ్ శుక్రవారం తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని హార్దిక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం ప్రజాసేవలో నిమగ్నమై రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ సేవలు అభినందనీయమని, వారికి భగవంతుడు సంపూర్ణ ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ప్రజలకు మరింత సేవ చేసే శక్తిని భగవంతుడు వారికి ఇవ్వాలని,ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ, పొన్నం కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## రాష్ట్రాభివృద్ధికి పొన్నం సేవలు అభినందనీయం

- మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు
- కాంగ్రెస్ పార్టీ భీంగల్ పట్టణాధ్యక్షులు : జేజే నర్సయ్య



**భీంగల్ (ప్రశ్న న్యూస్)** నిజామాబాద్ జిల్లా, భీంగల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జేజే నర్సయ్య శుక్రవారం తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని హార్దిక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం ప్రజాసేవలో నిమగ్నమై రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ సేవలు అభినందనీయమని, వారికి భగవంతుడు సంపూర్ణ ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ప్రజలకు మరింత సేవ చేసే శక్తిని భగవంతుడు వారికి ఇవ్వాలని,ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ, పొన్నం కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం

- పేదల సంక్షేమాభివృద్ధే ప్రజా ప్రభుత్వ లక్ష్యం
- కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గం ఇంచార్జి : ముత్యాల సునీల్ రెడ్డి
- ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశం వేడుకలో సునీల్ రెడ్డి హాజరు - లబ్దిదారుకు శుభాకాంక్షలు



**భీంగల్ (ప్రశ్న న్యూస్)** నిజామాబాద్ జిల్లా,భీంగల్ మండలం,ముచ్కూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు పథకం కింద మంజూరైన ఇంటి నిర్మాణం పూర్తికాగా, శుక్రవారం లబ్దిదారు అరుణ నూతన గృహ ప్రవేశ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గం ఇంచార్జి ముత్యాల సునీల్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం లబ్దిదారుకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవితం కల్పించడమే ఇందిరమ్మ ఇల్లు పథకం ప్రధాన లక్ష్యమని అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సొంతింటి కలను నెరవేర్చేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదల సంక్షేమం, అభివృద్ధే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. లబ్దిదారు అరుణ కొత్త ఇంటిలో సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు.అనంతరం లబ్దిదారు అరుణ ముత్యాల సునీల్ రెడ్డి,రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు జేజే నర్సయ్య, తెడ్డు అశోక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అవినాష్, గ్రామశాఖ అధ్యక్షుడు మురారి,లింబాద్రి, కొరడి రాజు,గ్రామ సర్పంచ్ శ్రీనివాస్, ఉప సర్పంచ్ రాము, వార్డు సభ్యులు,మహిళలు,తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

## దుర్గమ్మ తల్లి ఆలయానికి రూ. 55 వేల విరాళం

- బిజెపి నేత రామన్న గారి శ్రీనివాస్ గౌడ్ కు అభినందనలు



**మేడ్చల్( ప్రశ్న న్యూస్ )** మేడ్చల్ జిల్లా గిర్మాపూర్ లో శ్రీ శ్రీ శ్రీ దుర్గమ్మ తల్లి దేవాలయానికి బిజెపి సీనియర్ నేత రామన్న గారి శ్రీనివాస్ గౌడ్ రూ. 55 వేల విరాళాన్ని అందజేశారు.పెద్ద పండగ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకుడు రామన్న గారి శ్రీనివాస్ గౌడ్ రూ.55 వేల ను గుడికి విరాళాన్ని అందజేశారు. బొక్క శ్రీనివాసరెడ్డి,బొక్క ధర్మ రెడ్డి,వొంగేటి రఘుపతి రెడ్డి, వొంగేటి పద్మ రెడ్డి, చల్క బాలరెడ్డికి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా రామన్న గారి శ్రీనివాస్ గౌడ్ ను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమం లో బీజేపీ నాయకులు పెంజర్ల మల్లేష్ యాదవ్ మేడ్చల్ ,రతన్ రాథోడ్, నర్సింగ్ రావు వెంకటేష్ ముదిరాజ్ పాల్గొన్నారు

# గోషామహల్‌లో ఎలక్ట్రానిక్ మీడియా పేరుతో కొత్త దందా.?

- ఐటమ్ తీసుకోవడం తప్ప.. ప్లే చేయరుగా - అక్రమ నిర్మాణాల వద్ద వసూళ్లకే వీళ్ల ప్రాధాన్యత, అవినీతి అధికారులకు అండగా వీళ్లే
- దాదాపు పది ప్రముఖ ఛానల్ ల పేరుతో వసూల్ రాయుళ్లుగా వ్యవహరిస్తున్న రిపోర్టర్లు
- ఈ రిపోర్టర్లను అడ్డుపెట్టుకొని అవినీతి అక్రమాలకు బరితెగిస్తున్న అధికారులు
- గోషామహల్ లో అక్రమ నిర్మాణాలపై ఎవరు రాసిన, ఎవరు వచ్చిన, మేము ఊరుకోం అంటూ ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్ల జులుమ్






హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మాది ప్రముఖ ఛానల్.. వార్త వేస్తాం.. ఛానల్‌లో ప్లే చేస్తాం.. అంటూ లోగోలు పట్టుకొని మొదలయ్యే మాటలతో కొంతమంది రిపోర్టర్లు వార్తలు సేకరిస్తారు వాళ్ళ దగ్గర ఖర్చులు అంటూ కావలసింది దండుకుంటారు తర్వాత అంతే ఒక్క ఐటెం ప్లే అయితే ఒట్టు, ఇప్పుడు సెంట్రల్ జోన్ పరిధిలో గోషామహల్ నియోజకవర్గంలో కొంతమంది ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్లతో భయానికి మరో పేరుగా మారాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావాల్సిన కొందరు స్థానిక ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్లు ఇప్పుడు అక్రమ నిర్మాణాల చుట్టూ తిరుగుతూ మేము స్థానికులం మేమే వసూలు చేసుకోవాలి, మాకు ఈ నియోజకవర్గం రాసిచ్చారు మా జాగీరు అన్నట్లు 'సెట్టింగ్ సంస్కృతి'కి తెరలేపారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

అక్రమ నిర్మాణాలు ఎక్కడ కనిపించినా అక్కడికి ముందుగా అధికారుల కంటే కొందరు మీడియా వ్యక్తులే చేరుతున్నారని, "ఇక్కడ ఎవ్వరూ వార్తలు రాయకూడదు.. ముందు మాతో మాట్లాడాలి'' అంటూ దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. వీళ్లకు గోషామహల్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు సహకరిస్తూ వీళ్లు వసూలు చేస్తున్న దాంట్లో అధికారులకు వాటాలు ఇస్తున్నారన్న స్థానికుల ఆరోపణలు ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారులతో కుమ్మక్కై అవినీతి, అక్రమాలకు అండగా ఉంటూ లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఇప్పుడు గోషామహల్ ప్రజల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. సీనియర్లమని చెప్పుకుంటూ ఇలా అవినీతి అక్రమాలను ప్రోత్సహించే రిపోర్టర్లతోనే సమాజంలో జర్నలిజం అనే పదం భ్రష్టు పట్టిపోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## - వార్తల కంటే వసూళ్లకే ప్రాధాన్యం.?

స్థానికుల మాటల్లో చెప్పాలంటే "లోగోలు మాత్రం వంద పెడతారు, ఐటమ్ మాత్రం ఒక్కటీ ప్లే కాదు." చిన్న నిర్మాణం నుంచీ పెద్ద కమర్షియల్ బిల్డింగ్ వరకు ఎక్కడైనా నిబంధనల ఉల్లంఘనలు కనిపిస్తే అక్కడ కొందరు రిపోర్టర్లు గుంపులుగా చేరి మేము లోకల్ దాదాపు పది మందిని ఉన్నాము అని 'డీల్' మాట్లాడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఒకరికి కాకుండా దాదాపు పదిమంది వరకు కలిసి అక్రమ నిర్మాణాల వద్ద హల్చల్ చేస్తూ, "ఎవరికి ఇవ్వొద్దు.. మాకే ఇవ్వాలి" అంటూ ఒత్తిడి తెస్తున్నారట. ప్రజల సమస్యలు, కాలనీల్లో డ్రైనేజీ సమస్యలు, రోడ్ల దుస్థితి, నీటి ఇబ్బందులు, పారిశుధ్య సమస్యలు, ట్రాఫిక్ నరకం, ఇలా సెంట్రల్ జోన్ మొత్తంలో ప్రజలు పడుతున్న కష్టాలపై స్టోరీలు చేయడానికి కనీస అవగాహన కూడా ఉండదు. సమస్యలపై ఇక్కడ కొంతమంది రిపోర్టర్లకు సమయం దొరకదని అక్రమ నిర్మాణాల దగ్గర మాత్రం గంటల తరబడి గుమిగూడుతున్నారనే విమర్శలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. మంగళ్ హాట్, ప్రకాష్ టాకీస్ వద్ద రెండు అంతస్తులకు అనుమతులు తీసుకొని ఏకంగా అక్రమ సెల్లార్, దాదాపు 8 అంతస్తుల వరకు అక్రమ అంతస్తులతో కమర్షియల్ గోదాముల కోసం భారీ నిర్మాణాలు చేస్తుంటే వాటికి అండగా ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్లు నిలబడి టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారి మహేందర్ కు సహకరిస్తూ జిహెచ్ఎంసి ఆదాయానికి గండికోడుతూ సమాజ శ్రేయస్సును గంగలో కలిపి ధనార్జన లక్ష్యంగా వ్యవహరిస్తురన్న ఆరోపణలు ఉన్నాయి.

## - మీడియా ముసుగులో గూండాయిజం.?

"మీడియా" అనే పవిత్ర వృత్తిని కొందరు వ్యక్తిగత సంపాదనకు వేదికగా మార్చేశారనే ఆగ్రహం స్థానికుల్లో పెరుగుతోంది. గోషామహల్ ప్రాంతంలో కొందరు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల పేరు వినగానే బిల్డర్లు, చిన్న వ్యాపారులు, కాలనీ వాసులు భయపడే పరిస్థితి నెలకొన్నదని సమాచారం. "ఐటమ్ వేస్తాం... ఛానల్‌లో బ్లాస్ట్ చేస్తాం..." అంటూ బెదిరింపులకు దిగుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వార్త ప్రసారం చేస్తామంటూ డబ్బులు తీసుకుని చివరికి వార్తను పూర్తిగా పక్కన పెట్టేస్తున్న ఘటనలు అనేకం చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇలా మీడియా విశ్వసనీయ తను కొందరు రిపోర్టర్లు దిగజార్చడం వల్ల నిజాయితీగా పనిచేస్తున్న జర్నలిస్టుల ప్రతిష్ట కూడా దెబ్బతింటోందని సీనియర్ పాత్రికేయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## - ఛానల్ యాజమాన్యాలు స్పందించాలా.?

ప్రముఖ ఛానళ్ల పేర్లను వాడుకుంటూ కిందిస్థాయి రిపోర్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలపై ఆయా ఛానల్ యాజమాన్యాలు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఎవరు నిజమైన రిపోర్టర్, ఎవరు పేరును అడ్డంగా పెట్టుకుని దందా చేస్తున్నారో గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సెంట్రల్ జోన్ గోషామహల్ పరిధిలో కొంతమంది ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్ల వ్యవహారం తీవ్రస్థాయికి చేరింది కేవలం ధనార్జనే లక్ష్యంగా దాదాపు పదిమంది ఒక్కటై స్టాఫ్ రిపోర్టర్లు బ్యూరోలు అంటే కూడా అర్థం తెలవని రీతిలో వీళ్ళ వ్యవహారం చూస్తుంటే సమాజమే సిగ్గుపడే



దుస్థితి నెలకొంది ఇలాంటి తెలివిలేని కొంతమందికి ప్రముఖ ఛానల్లో ఇలా అవకాశం ఇచ్చారు అర్థం కాని పరిస్థితి నెలకొన్నది. ప్రజల సమస్యలను, అవినీతి అక్రమాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాల్సిన మీడియా రిపోర్టర్లు అక్రమ నిర్మాణాలకు కవచంగా మారి వార్తలు రాయడానికి వెళుతున్న రిపోర్టర్లను అడ్డుకోవడం చూస్తుంటే వీళ్ళు ఎంత నీచ స్థాయికి దిగజారిపోయారో అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి కొందరి మూర్ఖుల వల్ల పూర్తి గా జర్నలిజానికే మాయని మచ్చగా మారింది. వీళ్లకు కేవలం డబ్బు సంపాదన తప్ప వార్తలు ప్రచురణ చేయాలి అన్న కనీస ఇంగిత జ్ఞానం కూడా లేదన్న ఆరోపణలు ఉన్నాయి. లోగో పట్టుకొని డబ్బులు వసూలు చేయడం ఎవరైనా సమావేశం పెట్టారంటే వందల కొద్ది లోగోలు పెట్టి రిపోర్టర్లు వద్దు రా బాబు అనే దుస్థితికి తీసుకువచ్చిన ఘనత ఇలాంటి దరిద్రుల వల్లే మారిందన్న విమర్శలు ఉన్నాయి. ఇలాంటి రిపోర్టర్ల వల్ల ప్రజాస్వామ్యానికి ప్రమాద ఘంటికలు మోగినట్టేనని సామాజిక వర్గాలు హెచ్చరిస్తున్నాయి. సెంట్రల్ జోన్ గోషామహల్‌లో జరుగుతున్న ఈ వ్యవహారాలపై మీడియా సంస్థలు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను బయటపెట్టి ప్రముఖ చానళ్ల పేరుతో అక్రమార్కులకు సహకరిస్తున్న రిపోర్టర్లను వెంటనే తొలగించాలని స్థానికులు మీడియా యజమాన్యాలను కోరుతున్నారు.

# కీసరలో అక్రమ నిర్మాణాల రాజ్యం

## అన్ని చూస్తూ అధికారుల మౌనం

- అక్రమార్కులకు అండగా యంత్రాంగమా.? - టీపీఎస్ స్రవంతి అవినీతిపై ప్రజల ఆగ్రహం
- "ఆఫీసులో ఉండరు, ఫోన్ ఎత్తరు, ఫిర్యాదులు పట్టించుకోరు"
- కళ్లముందే భారీ అక్రమ షెడ్డు నిర్మాణం - డిప్యూటీ కమిషనర్ స్పందించకపోవడంపై అనుమానాలు








కీసర (ప్రశ్న న్యూస్) కీసర సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా విస్తరిస్తుండగా, వాటిని అడ్డుకోవాల్సిన అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపల్ చట్టంలో పట్టణ ప్రణాళిక నిబంధనలను బేఖాతరు చేస్తూ ఎటువంటి అనుమతులు లేకుండానే భారీ షెడ్లు, వాణిజ్య నిర్మాణాలు వెలుస్తున్నా కీసర సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు కళ్లుమూసుకుని కూర్చోవడం స్థానికుల్లో తీవ్ర ఆగ్రహానికి కారణమవుతోంది. కీసర నుంచి ఈసీఐఎల్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై, ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో ఒక భారీ అక్రమ షెడ్డు నిర్మాణం బహిరంగంగానే కొనసాగుతోంది. ప్రజల కళ్లముందే రోజురోజుకూ విస్తరిస్తున్న ఈ నిర్మాణం ఎలాంటి అనుమతులతో జరుగుతోందో స్పష్టత లేకపోయినా, పనులు మాత్రం ఆగకుండా సాగుతున్నాయి. స్థానికుల మాటల్లో చెప్పాలంటే, "ఎవరికి చెప్పుకున్నా ప్రయోజనం లేదు, లంచాలు తీసుకొని అధికారులు చూసీ చూడనట్లు వదిలేస్తున్నారు" అనే పరిస్థితి నెలకొంది. ఈ వ్యవహారంలో ముఖ్యంగా టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారిణి స్రవంతిపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజలు ఫిర్యాదులు చేసినా స్పందించరని, కార్యాలయంలో అందుబాటులో ఉండరని, ఫోన్ చేసినా ఎత్తరని స్థానికులు ఆరోపిస్తున్నారు. విధుల పట్ల ఇంత నిర్లక్ష్యం చేస్తున్న అధికారినిపై డిప్యూటీ కమిషనర్, జోనల్ కమిషనర్, మున్సిపల్ కమిషనర్ చర్యలు తీసుకోకుండా ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడుతున్నారు. "ప్రజల సమస్యలు వినాల్సిన అధికారి కనిపించకుండా పోతే ప్రజలు ఎవరిని ఆశ్రయించాలి.? కమిషనర్ అంటూ మండిపడుతున్నారు. గతంలో కూడా అక్రమ నిర్మాణాల విషయంలో ఆమెపై అనేక ఆరోపణలు వచ్చినట్లు స్థానికులు గుర్తు చేస్తున్నారు. ఇక డిప్యూటీ కమిషనర్ వైఖరిపైనా అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధాన రహదారి పక్కనే ఇంత భారీ నిర్మాణం జరుగుతున్నా డిప్యూటీ కమిషనర్, ఉన్నతాధికారులు ఇప్పటివరకు క్షేత్రస్థాయిలో తనిఖీ చేయకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అక్రమ నిర్మాణదారులు ముందుగానే వీళ్లను కలిసి కావలసిన నైవేద్యం ఇచ్చారా.? అన్న ప్రశ్నలు తనిత్తుతున్నాయి.

### ఫిర్యాదులు చేసిన చర్యలు లేకపోవడం వెనుక భారీగా చేతులు మారాయా.?

కీసర సర్కిల్ పరిధిలో అక్రమార్కులకు అధికార యంత్రాంగం అండగా నిలుస్తోందా.? అనే ప్రశ్నలు ఇప్పుడు ప్రజల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం చిన్నపాటి నిర్మాణానికే అనుమతులు తప్పనిసరి. కానీ కీసరలో మాత్రం నిబంధనలు కేవలం సామాన్యులకే వర్తిస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. డబ్బు, రాజకీయ అండ ఉంటే ఏ నిర్మాణమైనా చేసుకోవచ్చనే పరిస్థితి ఇక్కడ అవినీతి అధికారులతో నెలకొనడం పై ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. మరి దీనిపై జోనల్ కమిషనర్, కమిషనర్ ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

# నిరుపేద నిస్సహాయ స్థితిలో ఉన్న అనిల్ కోసంకర్

-10,000 ఆర్థిక సహాయం చేసిన సూరన్న




కొమరం భీమ్(ప్రశ్న న్యూస్) కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో ఒక విషాదకరమైన పరిస్థితి వెలుగులోకి వచ్చింది.సిర్పూర్ నియోజకవర్గం కౌటాల మండలం మొగడ్ ధగడ్ గ్రామానికి చెందిన అనిల్ కోసంకర్ అనే యువకుడు అత్యంత దయనీయ స్థితిలో ఉన్నాడు.విధి ఆడిన వింత నాటకంలో అనిల్ తన నిస్సహాయ స్థితితో పోరాడుతున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన అనిల్ పరిస్థితి చూస్తే ఎవరికైనా కళ్ళు చెమర్చక మానవు.వైద్యానికి స్తోమత లేక ఆ కుటుంబం అల్లాడిపోతోంది.ఈ విషయం సోషల్ మీడియా, వార్తల ద్వారా జర్నలిస్ట్ సూరన్న దృష్టికి వెళ్లడంతో ఆయన స్పందించి అనిల్ పడుతున్న బాధను చూసి చలించిపోయిన సూరన్న తక్షణమే స్పందించారు.మానవత్వమే పరమావధిగా భావించి, ఆ గ్రామానికి స్వయంగా చేరుకున్నారు.బహుజన ముద్దుబిడ్డగా పేరుగాంచిన సూరన్న, అనిల్ కుటుంబానికి భరోసా ఇచ్చారు.తన వంతు సహాయంగా ?10,000 నగదును అనిల్ కోసంకర్ కు అందజేశారు.ఈ చిన్న మొత్తం ఆ కుటుంబానికి ప్రస్తుత అవసరాలకు ఎంతో ఆసరాగా నిలిచింది.ఆపదలో ఉన్న ఒక నిరుపేద యువకుడిని ఆదుకోవడం నిజమైన మానవత్వం. సూరన్న చేసిన ఈ ఉదారతను మొగడ్ ధగడ్ గ్రామ ప్రజలు ఎంతో అభినందిస్తున్నారు. కేవలం వార్తలు చెప్పడమే కాకుండా, కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడంలో ఆయన ముందుంటారు అన్నది నిజం చేశారు. మనమందరం కూడా మనకు తోచిన రీతిలో అనిల్ వంటి వారిని ఆదుకోవాలని సూరన్న పిలుపునిచ్చారు.

# ప్రభుత్వ ఏర్పాటుకు పళనిసామిని ఆహ్వానించండి

## - గవర్నర్ కు టీటీవీ దినకరన్

చెన్నై (ప్రశ్న న్యూస్) తమిళనాడులో మరో ఆసక్తికర పరిమాణం చోటు చేసుకుంది. ఇప్పటికే విజయ్ ప్రభుత్వం ఏర్పాటు చేయడంపై సస్పెన్స్ కొనసాగుతోంది. తాజాగా, అమ్మ మక్కల్ మున్నేట్ర కజగం (ఏఎంఎంకే) పార్టీ ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ గవర్నర్‌ను కలిసి కొత్త ట్విస్ట్ ఇచ్చారు. అన్నాడీఎంకే అధినేత పళనిసామిని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ఆహ్వానించాలని గవర్నర్‌ను కోరారు. పార్టీ ప్రధాన కార్యదర్శిగా తాను, తన పార్టీ ఎమ్మెల్యే సంతకం చేసిన లేఖను గవర్నర్‌కు అందించినట్లు చెప్పారు. గవర్నర్‌ను కలిసిన అనంతరం దినకరన్ మీడియాతో మాట్లాడుతూ, తాము పళనిసామికి మద్దతు పలుకుతున్నామని చెప్పారు. మన్నార్‌గుడి నుంచి గెలిచిన తమ పార్టీ ఎమ్మెల్యే ఎస్.కామరాజ్ కూడా అన్నాడీఎంకేకు మద్దతుగా ఉన్నారని చెప్పారు. కాబట్టి పళనిసామిని ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి ఆహ్వానించాలని దినకరన్ కోరారు. ఆయనకు మెజారిటీ ఉందని తెలిపారు.



HEAD OFFICE
No. 21/11, 1st Main Road, Karpagam Garden, Adyar, Chennai - 600 020
Phone : 044 - 2848 1236

TTV DHINAKARAN
GENERAL SECRETARY

Dated 8th May, 2026

To
The Hon'ble Governor,
State of Tamil Nadu,
Lok Bhavan,
Chennai.

Subject: Letter of Support to AIADMK to form the new Government with Thiru Edappadi K.Palaniswami as the Chief Minister.

Hon'ble Sir,

I, TTV Dhinakaran, General Secretary of Amma Makkal Munnettra Kazagam hereby extend my full support to the claim of Thiru. Edappadi K.Palaniswami to form the new Government of the State of Tamil Nadu.

Our Party Candidate Mr.Kamaraj.S who contested in Mannargudi Constituency (167) have been elected as MLA of the Constituency.

Mr.Kamaraj.S MLA of Mannargudi Constituency (167) have also signed this Letter in support of the above claim.

It is humbly requested that Thiru Edappadi K.Palaniswami be invited to form the new Government and be sworn in as the Chief Minister, of the State of Tamil Nadu.

With kind regards

Yours Sincerely,

(KAMARAJ.S)
MLA,
MANNARGUDI CONSTITUENCY

TTV DHINAKARAN
GENERAL SECRETARY

## - సస్పెన్స్ థ్రిల్లర్‌ను తలపిస్తోన్న తమిళనాడు రాజకీయం

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం, ప్రభుత్వ ఏర్పాటు అంశం సస్పెన్స్ థ్రిల్లర్‌ను తలపిస్తోంది. నాలుగు రోజులుగా విజయ్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసే అంశంపై ఉత్కంఠ కొనసాగుతోంది. కాంగ్రెస్ మొదటి రోజున, వామపక్షాలు ఈరోజు మద్దతు పలికాయి. అయినప్పటికీ విజయ్‌కి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి కావాల్సిన ఎమ్మెల్యేల బలం లేదు. వీసీకే, ఐయూఎంఎల్ మద్దతు ఇస్తే విజయ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవచ్చు. కానీ చివరి నిమిషంలో ఆ పార్టీలు హ్యాండిచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ రెండు చోట్ల పోటీ చేసి గెలిచారు. ఆయన తిరుచ్చి (తూర్పు) సీటును వదులుకోనున్నట్లు ఇప్పటికే వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో అక్కడి నుంచి తనకు టిక్కెట్ ఇవ్వాలని, ఉపముఖ్యమంత్రి పదవి కావాలని వీసీకే పార్టీ అధినేత తిరుమావళవన్ డిమాండ్ చేసినట్లు టాక్ వినిపిస్తోంది. ఈ కారణంగానే ఆ పార్టీ గవర్నర్‌కు మద్దతు లేఖ ఇవ్వలేదని కథనాలు వచ్చాయి. మరోవైపు తాము ఎవరికి మద్దతు ప్రకటిస్తూ లేఖ ఇవ్వలేదని ఐయూఎంఎల్ తెలిపింది. తాము డీఎంకేతోనే ఉంటామని స్పష్టం చేసింది.

# ఇండోనేషియాలో బద్దలైన అగ్నిపర్వతం

## -10 కిలోమీటర్ల ఎత్తుకు ఎగిసిన బూడిద, ముగ్గురి మృతి



జకర్తా (ప్రశ్న న్యూస్) ఇండోనేషియాలో మరోసారి అగ్నిపర్వతం బద్దలైంది. నార్త్ మలుకు ప్రావిన్స్‌లోని దుకోనో అగ్నిపర్వతం శుక్రవారం ఉదయం విస్ఫోటనం చెందింది. ఈ దుర్ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయినట్లు స్థానిక పోలీసులు ధ్రువీకరించారు. పర్వతంపై చిక్కుకుపోయిన సుమారు 20 మంది పర్వతారోహకులను సురక్షితంగా తరలించేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 7:40 గంటలకు ఈ విస్ఫోటనం సంభవించింది. దీని ప్రభావంతో సుమారు 10 కిలోమీటర్ల ఎత్తు వరకు దట్టమైన బూడిద మేఘాలు ఆకాశంలోకి ఎగిసిపడ్డాయి. అగ్నిపర్వత బిలం నుంచి 4 కిలోమీటర్ల పరిధిలో ఎలాంటి కార్యకలాపాలు చేపట్టవద్దని అధికారులు ప్రజలను హెచ్చరించారు. వర్షాలు కురిస్తే అగ్నిపర్వత బురద ప్రవాహాలు (మడ్‌ఫ్లోస్) సంభవించే ప్రమాదం ఉందని కూడా హెచ్చరికలు జారీ చేశారు. దుకోనో అగ్నిపర్వతం ఈ ఏడాది ఫిబ్రవరిలో కూడా విస్ఫోటనం చెందింది. ఆ సమయంలో విమానయాన రంగానికి అధికారులు ఆరెంజ్ లెవెల్ హెచ్చరిక జారీ చేశారు. బూడిద కారణంగా శ్వాసకోశ సమస్యలు రాకుండా ఉండేందుకు ప్రజలు మాస్కులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. సముద్ర మట్టానికి 1,087 మీటర్ల ఎత్తులో ఉన్న దుకోనో, ఇండోనేషియాలోని 127 క్రియాశీల అగ్నిపర్వతాలలో ఒకటి. గత నెలలో ఇండోనేషియాలోని మౌంట్ సెమేరు అగ్నిపర్వతం కూడా పలుమార్లు విస్ఫోటనం చెందిన విషయం తెలిసిందే.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588